ప్రజాశక్తి
ఆదివారం 26 మార్చి 2023 8 పేజీలు

గుంటూరు పల్నాడు

మమ్మల్ని పట్టించుకోవడం లేదు

సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్లు

- మెంటల్ ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తుందేమో
- సమస్యలపై ధ్వజమెత్తిన కార్పొరేటర్లు
- కుక్కలబెడద, తాగునీటి ఎద్దడిపై విమర్శలు
- రూ.1377 కోట్లతో కార్పొరేషన్ బడ్జెట్‌కు ఆమోదం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో శనివారం పలు సమస్యలపై కార్పొరేటర్లు ప్రస్తావించారు. కుక్కల బెడద ఎక్కువగా ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు తమను నిలదీస్తున్నారని పలువురు వాపోయారు. దీనికి మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు స్పందిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం వ్యవహరించాలేగాని నిర్ణయమేమీ తీసుకోలేమని సమాధానమిచ్చారు. కుక్కలను నిరోధిస్తున్న వైద్యులపైనా కొందరు కేసులు వేస్తున్నారని అన్నారు. తాము కూడా కోర్టులో కేసులు దాఖలు చేస్తామని కార్పొరేటర్లు ఈచంపాటి ఆచారి, సంకురి శ్రీనివాస్, మహమూద్ వ్యాఖ్యానించారు.

నగరంలో తాగునీటి ఎద్దడిపై పలువురు ప్రస్తావించారు. బోర్లు కూడా నిర్మించడంలేదని, ఉన్నవి పని చేయడం లేదని శివారు గ్రామాల పరిస్థితి అధ్వానంగా ఉందని పలువురు కార్పొరేటర్లు ధ్వజమెత్తారు. కార్పొరేటర్లకు విలువ లేదని, రెండేళ్లుగా అధికారులు ఏమాత్రం శ్రద్ధ వహించడం లేదని మండిపడ్డారు. కనీస గౌరవ మర్యాదలు లేవని అన్నారు. ప్రతిసారీ ఇదే రీతిలో చేస్తాం...చూస్తాం అంటారు.. ఎక్కడి సమస్యలు అక్కడే ఉంటున్నాయి.. అని ఆగ్రహానికి గురయ్యారు. తాము మెంటల్ ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తుందోమోనని, ఇక్కడేమీ అర్థం కావడం లేదని ఈచంపాటి ఆచారి ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేటర్లతో అధికారులను మాట్లాడనీయడం లేదని తమకు కనీస గౌరవం లేదన్నారు. పలు వార్డుల్లో ట్యాంకర్ల ద్వారా నీరు రావడం లేదని తెలిపారు. బోర్లు మంజూరు చేయాలని కార్పొరేటర్లు బూసిరాజలత, ఆచారి, సంకూరి శ్రీనివాస్ తదితరులు ప్రస్తావించారు.

కంకరగుంట గేటు వద్ద రోడ్డుపై టెంటు వేసి వ్యాపారం చేస్తున్నా ఏమీ చేయడం లేకపోతున్నామని కార్పొరేటర్ బూసి రాజలత చెప్పారు. ఈ అంశంపై డిసిపి మూర్తి మాట్లాడుతూ రాజకీయ వత్తిడి వల్ల తాము ఏమీ చేయలేకపోయామని పేర్లు చెప్పలేనని అన్నారు. పలు

2లో

బుద్దారం, రూప్‌దార్ మృతదేహాలు

చికిత్స పొందుతున్న స్వామి, మాంగోడ్

పొట్టకూటి కోసం వచ్చి..

మృత్యుగూటికి వలస కూలీలు

- డిటోనేటర్లు పేలి ఇద్దరు దుర్మరణం - మరొకరి పరిస్థితి విషమం
- అనుమతుల్లేకుండానే క్వారీల నిర్వహణ

ప్రజాశక్తి - వినుకొండ

నిబంధనలకు విరుద్ధంగా త్వకాలు, అందుకోసం చేపట్టిన పేలుళ్లలో చత్తీస్‌ఘడ్‌కు చెందిన ఇద్దరు వలస కార్మికులు మృత్యువాత పడ్డారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వినుకొండ పట్టణంలో శుక్రవారం రాత్రి జరిగిన ఘటనపై బాధితుల కథనం మేరకు... స్థానిక తిమ్మాయపాలెం రోడ్డులోని పి.వెంకటరావు మెటల్ క్వారీలో పడమి బుద్ధారం (34), రూప్‌దార్ అలియాస్ డాంగో (27), స్వామి, మాంగోడ్ కార్మికులు పని చేస్తున్నారు. కొండరాయిని పేల్చేందుకు కొండకు ఘూతాలు వేసి డిటోడినేటర్లు అమర్చారు. అయితే శుక్రవారం రాత్రి ఉరుములు మెరుపుల వల్ల డిటోనేటర్లు పేలడంతో కొండ రాళ్లు క్వారీలోని పనిచేస్తున్న

2లో

విలపిస్తున్న బుద్ధారం, రూప్‌దార్ భార్యలు

అప్పులపాలవుతున్న పసుపురైతు

- మద్దతు ధరలు దక్కక ఏటేటేడు నష్టాలు
- క్వింటాళ్ రూ.10 వేలకు కొనుగోలు చేయాలి
- పసుపు బోర్డును ఏర్పాటు చేసి ఆదుకోవాలి
- పసుపు రైతు సదస్సులో రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మద్దతు ధర దక్కక పసుపు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ధర నిర్ణయించడంలో శాస్త్రీయ పద్ధతి అవలంభించడం లేదని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సూర్యనారాయణ అన్నారు. రైతుల్ని ఆదుకోవాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల పసుపు రైతుల సదస్సు మండలంలోని నూతక్కిలో శనివారం

2లో

సదస్సులో మాట్లాడుతున్న ఎం.సూర్యనారాయణ

పల్నాడు విజ్ఞాన కేంద్రానికి నేడు శంకుస్థాపన

ప్రజాశక్తి-నరసరావుపేట

ప్రజలకు శాస్త్రీయ అవగాహన కల్పించడానికి సెమినార్‌ల నిర్వహణకు సాహిత్యం, కళలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు, అభ్యుదయ భావాల వ్యాప్తి, ప్రజా సేవా కార్యక్రమాలు నిర్వహణ కోసం పల్నాడు విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ పనిచేస్తుందని విజ్ఞాన కేంద్రం ట్రస్ట్‌బోర్డ్ చైర్మన్ గుంటూరు విజయ్ కుమార్ అన్నారు. విజ్ఞాన కేంద్ర భవనాన్ని పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట కోటప్పకొండ రోడ్డులోని సిపిఎం కార్యాలయ ప్రాంగణంలో నిర్మించనున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా ఆదివారం నిర్వహించే శంకుస్థాపనకు అందరూ హాజరవ్వాలని కోరారు. ఈ మేరకు వివరాలను శనివారం వెల్లడించారు. శంకుస్థాపనకు ముఖ్య అతిథులుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బాలోత్సవాల వ్యవస్థాపకులు డాక్టర్ వాసిరెడ్డి రమేష్‌బాబు, ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, యుటిఎఫ్ పల్నాడు జిల్లా సహాధ్యక్షులు ఎ.బాగేశ్వరిదేవి, ఎస్ఇ జి.బ్రహ్మయ్య, రాష్ట్ర విజ్ఞాన కేంద్రాల సమన్వయ కమిటీ కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య హాజరవుతారని తెలిపారు. ఈ విజ్ఞాన కేంద్రంలో బాల బాలికలకు వ్యక్తిత్వ వికాసం కోసం బాలోత్సవాలు, యువతీ యువకులకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, కంప్యూటర్ శిక్షణ, మహిళలకు కుట్టుమిషన్ శిక్షణ తదితర కార్యక్రమాలూ నిర్వహిస్తామని తెలిపారు. కేంద్రం నిర్మాణం, నిర్వహణకు అందరూ సహకరించాలని కోరారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (ఆదివారం సాయంత్రం) : 6.25

సహరీ (సోమవారం ఉదయం) : 4.51

గుంటూరులో మళ్లీ కేబుల్ వార్

- ఆధిపత్యపోరాటంలో వినియోగదారుల విలవిల
- డిప్యూటీ మేయర్ తీరుపై మండిపడుతున్న ఆపరేటర్లు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరులో కేబుల్ వార్ మళ్లీ మొదలైంది. గతంలో ఆపరేటర్ల మధ్య ఆధిపత్య పోరాటంతో శాంతిభద్రతల సమస్యలు వచ్చాయి. ఆ తర్వాత ఒకరి ప్రాంతంలో మరొకరు జోక్యం చేసుకోకూడదని నిబంధనలతో ఇప్పటివరకు కేబుల్ ఆపరేటర్లు తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. తాజాగా శనివారం ఉదయం నుంచి గుంటూరు, పరిసర ప్రాంతాల్లో సిటీ కేబుల్ వైర్లను కత్తిరించారు. విద్యుత్ స్తంభాలకు ఉన్న ఈ వైర్లను ట్రాన్స్‌కో సిబ్బంది ద్వారా వీటిని కట్ చేశారు. దీంతో గుంటూరుతో పాటు పరిసరాల్లో కేబుల్ ప్రసారాలు నిలిచిపోయాయి. విద్యుత్ స్తంభాలకు ఉన్న కేబుల్ వైర్లను తొలగించాలని ప్రత్యేక స్తంభాలు వేసుకోవాలని ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులపై కేబుల్ ఆపరేటర్లు కోర్టును ఆశ్రయించారు. కోర్టు స్టే విధించింది. స్టే ఉత్తర్వులున్నా శనివారం

ఆకస్మికంగా వైర్లు కట్ చేశారని సిటీ కేబుల్ యాజమాన్యం ఆగ్రహం వ్యక్తం చేసింది. కేబుల్ ఆపరేటర్లు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల కేబుల్ రంగం విస్తరణలో దూసుకుపోతున్న నగర డిప్యూటీ మేయర్

2లో

నేడు ఉచిత కేన్సర్ నిర్ధారణ శిబిరం

ప్రజాశక్తి- మేడికొండూరు

మండల కేంద్రమైన మేడికొండూరు పంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం ఉచిత కేన్సర్ నిర్ధారణ శిబి రము నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ పూల నాగమణి తెలిపారు. విజయవాడకు చెందిన హెచ్ సి జి క్యాన్సర్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక శిబిరము జరగనుంది. ఈ కార్యక్రమంలో క్యాన్సర్ విభాగంలోని పలువురు అనుభవజ్ఞులైన డాక్టర్లు అందుబాటులో ఉంటారని తెలిపారు. మండలంలోని 14 గ్రామ పంచాయతీల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

3వ విడత ఆసరా లబ్ధి రూ. 7.80 కోట్లు

ప్రజాశక్తి - మాచర్ల

వైఎస్ఆర్ అసరా 3వ విడత పంపిణీ కింద పట్టణ పరి ధిలో మహిళలకు రూ.7.80 కోట్లు జమైనట్లు మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, కమిషనర్ ఇవి రమణబాబులు తెలిపారు. ఈ మేరకు సిఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా శనివారం నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయం నుండి చైర్మన్, కమిషనర్ తదితరులు వర్చువల్‌గా పాల్గొన్నారు. పట్టణంలో 677 స్వయం సహాయక సంఘాలకు చెందిన 6,520 మంది లబ్ధిపొందుతారని చెప్పారు. కార్యక్రమంలో మెప్మా సిబ్బంది సుబ్బారావు, అంజిలి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా మాచర్ల రూరల్ పరిధిలో 945 స్వయం సహాయక సంఘాలకు చెందిన లబ్ధిదారులకు రూ.7.99కోట్లు జమైనట్లు ఎంపిడిఒ వి.కోటేశ్వరరావు తెలిపారు. వర్చువల్‌గా కార్యక్రమంలో సర్పంచ్ యశోదమ్మ, విఆర్ఒ రవికుమార్, పంచాయితీ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మంగళగిరిలో 27న ఆసరా చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-మంగళగిరి

ఈ నెల 27వ తేదీన వైయస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం మంగళగిరి మార్కెట్ యార్డ్ ఆవరణలో ఉదయం 10 గంటలకు జరుగుతుందని కార్పొరేషన్ కమిషనర్ యూ శారదా దేవి శనివారం తెలిపారు.

'బెదిరింపులకు కాంగ్రెస్ భయపడదు'

ప్రజాశక్తి - మాచర్ల

అనర్హత వేటు లాంటి బెదిరింపులకు కాంగ్రెస్ భయపడదని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ యరమల రామ చంద్రారెడ్డి అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. అదాని తంతుపై ప్రశ్నించే కొద్దీ కాంగ్రెస్ పార్టీ నాయకులపై కేంద్ర ప్రభుత్వం కక్ష సాధింపు వేగం పెంచుతోందని విమర్శించారు. అదానీ వ్యవహారంలో మోడీ, బిజెపిల పాత్రను విస్మరించలేమన్నారు.

రాహుల్‌పై అనర్హత వేటు దుర్మార్గం

ప్రజాశక్తి-పెదకాకాని

రాహుల్ గాంధీపై కేసు వేయించడం, ఆ కేసులో శిక్ష పడిన కారణంగా ఎంపిగా అనర్హత వేటు వేయడం దుర్మార్గపు చర్య అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం పాల్ విజయకుమార్ అన్నారు.పెదకాకానిలో శనివారం విలే కర్లతో ఆయన మాట్లాడారు. బిజెపి అధికారంలోకి వచ్చాక రాజ్యాంగానికి తూట్లు పొడుస్తోందని విమర్శించారు.

8, 9 తేదీల్లో ఉచిత వక్త శిక్షణా శిబిరం

ప్రజాశక్తి-మంగళగిరి

స్టూడెంట్స్, టీచర్స్, ఎడ్యుకేటర్స్, పేరెంట్స్ (స్టెప్) జాతీయ సమితి ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాస నిపుణులు సైకాలజిస్ట్ ప్రత్యూష సుబ్బారావు నాయకత్వంలో ఏప్రిల్ 8 9 తేదీల్లో విజయవాడలో రెండు రోజుల ఉచిత వక్త శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు స్టెప్ రాష్ట్ర సమితి సభ్యులు ఆకురాతి శంకరరావు శనివారం తెలిపారు. యువకులలో ఉన్న అంతర్గత శక్తి సామర్థ్యాలను వెలికి తీయడమే స్టెప్ ప్రధాన ఉద్దేశం అని ఆయన పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు తమ పేర్లను 9030644440 నంబర్ కు ఫోన్ చేసి వారి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

పోలీసుల పల్లె నిద్ర

ప్రజాశక్తి-విజయపురిసౌత్

గురజాల డిఎస్పి జయరాం ప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి మాచర్ల మండలం ఏకోనాంపేటలో మాచర్ల రూరల్ సీఐ షేక్ సమీముల్లా, విజయపురిసౌత్ ఎస్ఐ పి.అనిల్ కుమార్‌రెడ్డి పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. సిఐ మాట్లాడుతూ ప్రజలు ప్రశాంతంగా జీవించాలని, వివాదాల జోలికి వెళ్లొద్దని సూచించారు. ఘర్షణలకు పాల్పడకుండా అందరూ స్నేహభావంతో ఉండాలన్నారు. ఏవైనా సమస్యలుంటే పోలీసులను సంప్రదించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎఎస్ఐ మస్తాన్‌వలి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ముప్పాళ్ల : గ్రామాల్లో ప్రజా సమస్యలు తెలుసు కునేందుకు ప్రజలలో తాను మమేకమై పల్లె నిద్ర చేస్తున్నట్లు ముప్పాళ్ల ఎస్ఐ పట్టాబి. రామయ్య తెలిపారు. మండలంలోని నార్నె పాడులో ఎస్ఐ పల్లెనిద్ర చేపట్టారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ ప్రజ లలో పోలీసు పట్ల ఫ్రెండ్లీ పోలీసు వ్యవస్థ ఉండే విధంగా గ్రామంలో ఉన్న ప్రజా సమ స్యలపై అవగాహన కలిగేందుకు పల్లె నిద్ర చేపట్టినట్లు తెలిపారు.కార్య్ర కమంలో ఎఎస్ఐ హిమామ్,హెడ్ కాని స్టేబుల్ మాధవరావు పాల్గొన్నారు. **నాదెండ్ల:** మండలంలోని గురిజవోలులో పల్లె నిద్ర నిర్వహించినట్లు నాదెండ్ల ఎస్ఐ ఆవుల భాస్కరరావు తెలిపారు. కార్య క్రమంలో పలువురు గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఏకోనాంపేట లో..

నాదెండ్లలో..

మమ్మల్ని పట్టించుకోవడం లేదు

(మొదటి పేజీ తరువాయి)

వార్డులో జియో కంపెనీ ఇష్టానుసారంగా కేబుల్స్ ఏర్పాటు చేస్తోందని, తాగునీటి పైపు లైన్లు, డ్రెయినేజి కనెక్షన్లను గందరగోళం చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని కార్పొరేటర్లు అచ్చాల వెంకటరెడ్డి, రోషన్, ఆచారి, సంకురు శ్రీనివాస్, మహమద్, మీరావలి, చిష్టిబాష తదితరులు ధ్వజమెత్తారు. వారివల్ల రోడ్లు ధ్వంసం అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

వార్షిక బడ్జెట్‌కు ఆమోదం

నగర పాలక సంస్థ 2023-24 వార్షిక బడ్జెట్‌ను రూ.1377.53 కోట్ల అంచనాలతో మేయర్ అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆమోదించారు. శనివారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో బడ్జెట్‌పై చర్చించారు. మేయర్ మాట్లాడుతూ 2022-23 సంవత్సర అంత్య నిల్వ రూ. 608. 93 కోట్లను సవరించిన అంచనాలతో 2023-24 సంవత్సరానికి ప్రారంభ నిల్వగా ఉంటుందన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆదాయం రూ.768.59 కోట్లుగా, ఖర్చులు రూ.976.25 కోట్లు అని అన్నారు. ప్రారంభ నిల్వ, ఆదాయం కలిపి రూ.1377.53 కోట్ల నగరపాలక సంస్థ వార్షిక బడ్జెట్‌ను సభ్యులు సూచించిన సవరణలతో నగరపాలక సంస్థ కౌన్సిల్ ఆమోదించినట్లు చెప్పారు. బడ్జెట్ గుంటూరు నగర సమగ్రాభివృద్ధికి అద్దం పట్టేలా ఉందని, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు సూచనలు పరిగణలోకి తీసుకొని, బడ్జెట్‌ను రూపొందించామని తెలిపారు.

ప్రతి ఒక్కరికీ స్వచ్ఛమైన తాగునీరు, పారిశుధ్యం, ఆహ్లాదకరమైన వాతా వరణం అందించేలా పార్కుల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు అధికంగా కేటాయించామని చెప్పారు. సమావేశంలో నగర కమిషనర్ కీర్తి చేకూరి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్, డిప్యూటీ మేయర్ షేక్ సజీల, అదనపు కమిషనర్ పెద్ది రోజా, డిప్యూటీ కమిష నర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకటకృష్ణయ్య, ఎక్జామినర్ ఆఫ్ అకౌంట్స్ నాగశ్రీనివాస్, ఎస్ఇ భాస్కర్, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

మృత్యుగూటికి వలస కూలీలు

(మొదటి పేజీ తరువాయి)

కూలీలపై పడ్డాయి. పడమి బుద్ధారం అక్కడకక్కడే మృతిచెందగా రూప్‌దార్, స్వామి, మాండోస్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని వినుకొండలోని ఓ ప్రైవేటు వైద్యశాల తరలించగా చికిత్స పొందే క్రమంలో రూప్‌దార్ మృతిచెందాడు. మరో ఇద్దరు చికిత్స పొందుతున్నారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది.ప్రమాద సమాచారం తెలుసుకున్న తహశీల్దార్ కిరణ్ కుమార్, పట్టణ సిఐ అశోక్‌బాబు, ఎస్ఐలు ఘటనా స్థలిని పరిశీలించి వివరాలు సేకరించారు. క్వారీ యజమాని, నిర్వాహకులను విచారణ చేసి కేసు నమోదు చేశారు. మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుల కుటుంబాలను ఆదుకుంటామని, యాజమాన్యం ద్వారా సాయం అందించే ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మ నాయుడు చెప్పారు. కుటుంబాన్ని పోషించుకునేందుకు రాష్ట్రం దాటి వచ్చిన కూలీల మృతితో వారి కుటుంబీకులు విలపిస్తున్న తీరు అందర్నీ కన్నీరు పెట్టించింది. బుద్ధారం భార్య బింబిలా, రూప్‌దార్ భార్య ఊర్మిళ కన్నీరు మున్నీరయ్యారు. తమ ప్రాంతంలో పనులు సరిగా దొరక్కపోవడం, పని ఉన్నా నా డబ్బుతో కుటుంబం గడవడం కష్టమవడంతో ఇక్కడికి పనులకు వచ్చామన్నారు. ఇప్పుడు పెద్దదిక్కునే కోల్పోయామని గొల్లుమన్నారు.

అనుమతుల్లేని క్వారీలు..

వినుకొండలో కొండ చుట్టూ సుమారు 11 రాయి క్రషర్ క్వారీలున్నాయి. ఇవన్నీ అనుమతులు లేకుండా కొనసాగుతున్నాయి. క్వారీ నిర్వహించాలంటే సేఫ్టీమైన్స్ నెల్లూరు వారి అనుమతులతో పాటు మైనింగ్ శాఖ దాచేపల్లి, ఎన్విరాన్మెంట్ (ఈసీ) అనుమతులు అవసరం. రెవిన్యూ పోలీస్ అనుమతులూ ఉండాలి. కానీ ఏ ఒక్క క్వారీకి అనుమతులు లేవు. మూడు క్వారీలకు గతంలో మైనింగ్ అనుమతులున్నా అవి రెన్యువల్ చేయించుకోలేదు. ఈ అంశాలపై తహశీల్దార్ మాట్లాడుతూ క్వారీలో ప్రమాదంపై విచారణ చేపట్టామన్నారు. వినుకొండలో ఉన్న క్రషర్ క్వారీల అనుమతులపై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సాహితివేత్త , సినీ నటి లకు ఎన్టీఆర్ పురస్కారాలు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో తెనాలిలో జరుగుతున్న ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో ప్రతి శని, ఆదివారం ఎన్టీఆర్ వ్యక్తిత్వం ఆయన నటించిన సినిమాలపై చర్చా కార్యక్రమం శనివారం స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ హాల్లో జరిగింది. రేపల్లెకు చెందిన ప్రముఖ సాహితీ వేత్త, ప్రఖ్యాత రంగస్థల కళాకారుడు మన్నే శ్రీనివాసరావు, సినీ, టివి, రంగస్థల హైదరాబాద్ కళాకారిణి నాగమణిలకు ఎన్టీఆర్ పుర ష్కారాన్ని అందజేశారు.

గుంటూరులో మళ్లీ కేబుల్ వార్

(మొదటి పేజీ తరువాయి)

డైమండ్‌బాబు తన నెట్‌వర్కును విస్తరింప చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అధికారులపై వత్తిడి తెచ్చి వైర్లు కత్తిరింపజేసినట్టు ఆరోపణలు వస్తున్నాయి. కేబుల్ ప్రసారాలు నిలిచి ప్రజలు తీవ్ర అసౌర్యానికి గురవుతున్నారు.

డైమండ్ కక్షసాధింపులు ఆపాలి

డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు కేబుల్ ఆపరేటర్లపై కక్ష సాధింపు చర్యలను ఆపాలని కేబుల్ ఆపరేటర్ల సంఘం హెచ్చరించింది. నగరంలో సిటీ కేబుల్ నెట్‌వర్క్ కేబుల్‌ను ఉద్దేశ పూర్వకంగా ఆయన కట్ చేయించారని కేబుల్ ఆపరేటర్ సంఘ నాయకులు అన్నపరెడ్డి విజయ్ భాస్కర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం స్థానిక అశోక్‌నగర్‌లోని సిటీ కేబుల్ ఆఫీసులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన సొంత కేబుల్ ఒకటే గుంటూరులో ఉండాలన్న దురుద్దేశంతో విద్యుత్ ఉద్యోగుల ద్వారా వైర్లను డైమండ్‌బాబు కట్ చేయించారని, కేబుల్ ఆపరేటర్ల పొట్టగొడితే ఉపేక్షించేది లేదని అన్నారు. వైర్లను యథాతథంగా ఉంచకుంటే ఆదివారం నుండి తామూ డైమండ్ బాబు నెట్‌వర్క్ వైర్లను తెంచడానికి వేనకాడబోమని అన్నారు.

అప్పులపాలవుతున్న పసుపురైతు

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు. సదస్సుకు రైతు సంఘం నాయకులు బి.జానారెడ్డి అధ్యక్షత వహించగా సూర్యనారాయణ మాట్లాడుతూ పసుపు రైతులకు కొన్నేళ్లుగా సరైన ధరలు దక్కక అప్పులపాలవుతున్నారని, ఈ ఏడాదైనా ధర రాకపోతుందా? అనే ఉద్దేశంతో ఏళ్ల తరబడి సాగు చేస్తున్నారని చెప్పారు. పదేళ్ల కిందట రూ.10-14 వేల ధరుంటే కేంద్ర ప్రభుత్వం ఈ-నామ్ విధానాన్ని తేవడంతో ధరలు పడిపోయాయని చెప్పారు. అప్పటి నుండి రైతులు కోలుకోవడం లేదని అన్నారు. దుగ్గిరాల పసుపు యార్డులో పసుపు కొమ్ములు క్వింటాళ్ సగటు ధర రూ.4,300 నుండి రూ.5,800 వరకే ఉండగగా కాయ ధర రూ.4,300 నుండి రూ.5,475 మాత్రమే ఉందన్నారు. అయితే ఎకరా పసుపు సాగుకు రైతుకు రూ.లక్షన్నర ఖర్చువుతోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కేవలం 22 పంటలకే మద్దతు ధరను అందిస్తోందని, అందులో పసుపు లేదని తెలిపారు. క్వింటాళ్ రూ.10 వేల చొప్పున ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. జిగట, కర్కుమెన్ శాతం ఎక్కువగా ఉండే, దిగుబడి అధికంగా వచ్చే విధంగా, చీడపీడలను తట్టుకునేలా నాణ్యమైన పసుపు విత్తనాలను విత్తనాలను వృద్ధి చేయాలని, అందుకు పరిశోధన కేంద్రాలను గుంటూరు కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరారు. పొగాకు బోర్డు మాదిరే పసుపు బోర్డును ఏర్పాటు చేసి పసుపు రైతుల్ని ఆదుకోవాలని కోరారు. ఇందుకోసం రైతులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పాలకులు 'రైతే రాజు.. రైతే దేశానికి వెన్నెముక' అంటూ ప్రకటనలు గుప్పిస్తారని, అనంతరం పట్టించుకోడం లేదని అన్నారు. పసుపును అనేక కాస్మాటిక్స్‌లో వాడుతుంగా వాటిల్లో వచ్చే లాభాలకు, రైతుకు అందే ధరకు పొంతనే ఉండడం లేదని చెప్పారు. అకాల వర్షాలు వల్ల పసుపు రైతు కూడా తీవ్రంగా నష్టపోతున్నా వారిని గుర్తించడంలో ప్రభుత్వానికి శ్రద్ధ లేదన్నారు. రైతులకు బీమా సౌకర్యం అందడం లేదన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.అజయ్ కుమార్, నాయకులు ఎం.శివసాంబిరెడ్డి, వి.భారతి, వి.సాంబశివరావు, టి.ప్రసాద్‌రెడ్డి, ఎం.శ్రీనివాసరెడ్డి, ఈశ్వరరెడ్డి, వెంకటప్పరెడ్డి పాల్గొన్నారు.

పేదల విముక్తి కోసం జీవితాంతం బాపనయ్య కృషి

ప్రజాశక్తి-గుంటూరు : గుంటూరు బాపనయ్య తన జీవితాంతం పేదల విముక్తి కోసం కృషి చేశారని, వారి ఆశయాలను, లక్ష్యాలను కొనసాగించటమే వారికి నిజమైన నివాళి అని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామరావు అన్నారు. శనివారం బ్రాడీపేటలోని సిపిఎం కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు అధ్యక్షతన గుంటూరు బాపనయ్య సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత బాపనయ్య చిత్రపటానికి సిపియం సీనియర్ నాయకులు ఆది నికల్సన్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పాశం రామారావు మాట్లాడుతూ గుంటూరు బాపనయ్య తన జీవితాంతం కులవివక్ష, అంటరానితనానికి వ్యతిరేకంగా, కార్మికులు, వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేశారని, కూలిరేట్లు పెంపు, పాలేర్ల సమస్యలపై ఉద్యమాలు నడిపారని తెలియచేశారని తెలిపారు. కృష్ణా జిల్లా దివిసీమలో చల్లపల్లి జమిందారు పెత్తనానికి వ్యతిరేకంగా, 17 వేల ఎకరాల మిగులు భూములను పేదలకు పంచేందుకు పోరాటాలు నడిపారన్నారు. 3 సార్లు ఎమ్మెల్యేగా, ఒక సారి ఎమ్మెల్సీగా ఎన్నికై పేదల సమస్యలను అసెంబ్లీలోను, మండలిలోను చర్చించి పరిష్కారానికి కృషి చేశారని పేర్కొన్నారు. సిపియం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై. నేతాజి మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక నిత్యజీవితావసర సరుకులు, పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని, ఈ విధానాలకు వ్యతిరేకంగా గుంటూరు బాపనయ్య స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపియం నగర కార్యదర్శి కె.నళినీకాంత్, జిల్లా నాయకులు యం. రవి, ఎస్.ఎస్.చెంగయ్య, యన్. భావన్నారాయణ, బైరగాని శ్రీనివాసరావు, కాకుమాను నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-మంగళగిరి : పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమించిన మహా వ్యక్తి గుంటూరు బాపనయ్య అని సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు అన్నారు. శనివారం సాయంత్రం మంగళగిరి సిపిఎం కార్యాలయంలో బాపనయ్య వర్ధంతి సందర్భంగా బాపనయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. రాఘవులు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ బాపనయ్య ప్రజాప్రతినిధిగా సిపిఎం నాయకుడిగా అనేక ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి వై కమలాకర్, సిపిఎం నాయకులు ఎం చలపతిరావు, ఎం బాలాజీ, ఎస్ వెంకటేష్, వివిధ ప్రజా సంఘాల నాయకులు జె నవీన్ ప్రకాష్, టి సీతారామయ్య, టి రామారావు, సికా కోటేశ్వరావు, మంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి : పేదల సమస్యల పరిష్కారం కోసం కార్యదీక్షతో పనిచేసిన బాపనయ్య దీక్షాపరుడని పలువురు వక్తలు కొనియాడారు. సిపిఎం అగ్రనాయకులు గుంటూరు బాపనయ్య వర్ధంతి సభలు శనివారం తాడేపల్లిలోని మేకా అమరారెడ్డిభవనం, రాజధాని ముఖద్వారమైన ఉండవల్లిలోని సిపిఎం కార్యాలయంలో జరిగాయి. ఈ సందర్భంగా బాపనయ్య చిత్రపటానికి దుర్గారావు, ఈమని రామారావులు పూలమాలలు వేసి నివాలులర్పించారు. పార్టీ ద్వారా వచ్చిన పలుకుబడి, పదవులను ప్రజల కోసం వినియోగించిన ధన్యజీవి బాపనయ్య అని కొనియాడారు. కార్యక్రమంలో సిపిఎం రాజధాని నాయకులు వి. వెంకటేశ్వరరావు, సిహెచ్ సుందరరావు, టి.బక్కిరెడ్డి, జి.శ్రీనివాసరెడ్డి, పి.గాంధ్ర, వెంకటనారాయణ, సిపిఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకర్‌రావు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, బూరగ వెంకటేశ్వర్లు, వేముల దుర్గారావు, గాదె సుబ్బారెడ్డి, టి. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్: గుంటూరు బాపనయ్య వర్ధంతి కార్యక్రమం ఎంటిఎంసీ పరిధిలోని గుండిమెడ గ్రామంలో జరిగింది. బాపనయ్య చిత్రపటానికి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి బత్తుల సంసోను పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం తాడేపల్లి మండల నాయకులు పల్లె కృష్ణ మాట్లాడుతూ గుంటూరు బాపనయ్య సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా, వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప నాయకుడని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం కుంచనపల్లి గ్రామ నాయకులు అమ్మిశెట్టి రామారావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పిల్లి రాములు, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మేడికొండూరు : వ్యవసాయ కార్మికుల కోసం, పాలేరుల కనీస హక్కుల కోసం, దున్నేవానికే భూమి అనే లక్ష్యంతో బడుగు బలహీన వర్గాల కోసం పని చేసిన గుంటూరు బాపనయ్య వర్ధంతి కార్యక్రమం మేడికొండూరు పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి బొట్ల రామకృష్ణ బాపనయ్య చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

గుంటూరు జిల్లాలో సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఘన నివాళి

గుంటూరు సిపిఎం కార్యాలయంలో

మంగళగిరి సిపిఎం కార్యాలయంలో

గుండిమెడలో

తాడేపల్లిలో

మేడికొండూరులో

ఎమ్మెల్యే శ్రీదేవి సస్పెన్షన్ సబబే

వైసిపి పటిష్టతకు కృషి : కత్తెర సురేష్‌కుమార్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పార్టీ కార్యకలాపాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్న తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవిని సస్పెన్షన్ సబబేనని నియోజకవర్గం సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ తెలిపారు. గుంటూరు భారత్‌పేటలో తన నివాసంలో శనివారం సాయంత్రం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో పార్టీ ప్రయోజనాలకు భిన్నంగా పనిచేసిన శ్రీదేవిని పలుమార్లు సిఎం జగన్ క్షమించారని తెలిపారు. కరోనా సమయంలో శ్రీదేవిని రక్షించిన సిఎం జగన్ పట్ల కనీస కృతజ్ఞతలేకుండా ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని ఓడించేలా ఓటు వేసిన శ్రీదేవి తీరును ఆయన ఖండించారు. నియోజక వర్గంలో పార్టీపటిష్టతకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. నాయకులందరికీ కలుపుకొని వెళ్లి పార్టీకి పూర్వవైభవం తీసుకువస్తామని తెలిపారు. శ్రీదేవి తీరు వల్ల చాలా మంది పార్టీకి దూరం అయ్యారని చెప్పారు. పార్టీ నాయకులు శివారెడ్డి మాట్లాడుతూ శ్రీదేవి గత నాలుగేళ్లుగాఎన్నో అవినీతి అక్రమాలుచేశారని వాటిని బయటపెడతామని అన్నారు. కార్యకర్తలు,నాయకుల వద్ద రూ.15 కోట్లుతీసుకున్నారని ఆమె నుంచి వీటిని వసూలు చేస్తామని అన్నారు. కొమ్మినేని రామచంద్రరావు, తాళ్ల శివనాగరాజు యాదవ్, బెజ్జం రామచంద్రరావు, బండ్ల పున్నారావు తదితరులు శ్రీదేవి పనితీరు వల్ల పార్టీకితీరని నష్టం జరిగిందన్నారు. పార్టీ అధిష్టానం ఇప్పటికైనా ఆమెపై చర్య తీసుకున్నందుకు వారు హర్షం వ్యక్తం చేశారు.

వేలం ప్రకటన
మహారాజశ్రీ తెనాలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో
E.P. 130/2022 in OS 467/2019

Between :
Yarava Tirupathi Reddy, O/o late Anki Reddy, Chinaravuru, Tenali ... DHr
And
Munaga Venkateswarlu, S/o Late Narasimha Rao, Nazarpet, Tenali ... JDr

పై నెంబరు ఇ.పి.లో ఈ దిగువ షెడ్యూలు దాఖలా జె.డి.ఆర్ యొక్క స్థిరాస్తిని పై కోర్టువారిచే ది. 17-4-2023వ తేదీన ఉదయం 10-30 గం.ల లగాయతు వేలం వేయబడును. కావలసిన వారు వేలంపాటలో పాల్గొని పాడుకొనవచ్చును.

షెడ్యూలు
Guntur District, Tenali Sub Division, Tenali Municipality Survey, 8th ward, 2nd Block, T.S.No. 91, Ac.0-20 cents in Which Door No.1-13-17, an extent of 130 Sq. yards of site in which mortgaged property in an extent of 40 sq. yards of site and RCC building with all structures bounded by :-
East : Municipal Bazar
South : No Boundary Tirupathamma Temple West : Municipal Bazar
North : Meduri Ramesh Chandra
within the boundaries an extent of 40 Sq. yards of site and constructed RCC data house with all structures with current fittings, meter municipal tap etc.
DHR Value Rs. 10,00,000/-
Amina Value Rs. 11,00,000/-
Market Value Rs. 11,10,000/-
Sale Date : 17-4-2023
Further Hearing : 24-4-2023

Note : EC దాఖలా ది. 14-5-2009న Dock 2215/2009 SRO Tenali లో DHR అయిన యరవ తిరుపతిరెడ్డి గారికి JDR అయిన మునగ వెంకటేశ్వర్లు రిజిష్టరు తనఖా చేసియున్నారు. సదరు తనఖాకు లోబడి వేలంపాట జరగవలయును. ది. 28-12-2010 మరియు ది. 13-11-2018న జరిగిన Gift deeds శ్రీ కోర్టు జప్తు తర్వాత జరిగినందన లోబడనవసరం లేదు.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)
జి.మల్లిఖార్జునరావు,
డిహెచ్‌ఆర్ తరపు అడ్వకేటు,
గుంటూరు.
సెల్ : 98488 90533.

జనగణన దీక్షకు మద్దతివ్వండి

ఎమ్మెల్సీ అప్పిరెడ్డికి బిసి సంక్షేమ సంఘం నాయకులు వినతి

ప్రజాశక్తి-గుంటూరు : జాతీయ స్థాయిలో ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద ఈనెల 28, 29న జరిగే జనగణన దీక్షకు మద్దతు ఇవ్వాలని బిసి సంక్షేమ సంఘం నాయకులు ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిని కోరారు. ఈమేరకు శనివారం అప్పిరెడ్డికి బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు కుమ్మర క్రాంతికుమార్ వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనాభా లెక్కల్లో బిసి కులగణన జరిపిస్తామని హామీ ఇచ్చిన బిజెపి ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనూ ఆ ఊసెత్తట్లేదన్నారు. దాంతోపాటు, పరిష్కారానికి నోచుకోని ఎన్నో బిసి సామాజిక వర్గ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 28, 29 తేదీల్లో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జనగణన దీక్ష చేపడుతున్నట్లు చెప్పారు. ఈ దీక్షలకు దేశ వ్యాప్తంగా రాజకీయ ప్రముఖులు, బిసి సామాజిక తరగతుల ప్రతినిధులు, మేధావులు, జాతీయ పార్టీల నాయకుల పాల్గొంటారన్నారు. కావున వైసిపి నుండి దీక్షలకు మద్దతు ఇవ్వాలని కోరారు.


అప్పిరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మంత్రి కాన్వాయ్ ఢీకొని ఎఎస్ఐకు గాయాలు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటిఎంసీ పరిధిలోని కుంచనపల్లి జాతీయ రహదారి వద్ద శనివారం ప్రమాదం చోటుచేసుకుంది. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి ముంగనూరు జయరాం కాన్వాయ్ కుంచనపల్లి జయభేరి ఎస్టేట్ సమీపంలో అదుపుతప్పి, ముందు వెళ్తున్న కారును ఢీ కొట్టింది. దీంతో కాన్వాయ్ ముందు భాగం దెబ్బతింది. కారులో ఉన్న ఏఎస్ఐ కోటేశ్వరరావుకు గాయాలవడంతో, తాడేపల్లి మణిపాల్ హాస్పిటల్‌కు తరలించారు. కాన్వాయ్‌లో కార్మిక శాఖ మంత్రి లేకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

లైంగిక దాడిపై కేసు

ప్రజాశక్తి-తెనాలి

వివాహం చేసుకుంటానని నమ్మించి మహిళపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణ త్రీ టౌన్ పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం తాడేపల్లిగూడెం కు చెందిన పద్మకుమారి భర్తతో విడిపోయి ఒంటరిగా ఉంటుంది. రెండో వివాహం చేసుకునేందుకు చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా రవి దేవరాజ్ అనే వ్యక్తిని సంప్రదించింది. ఈ నేపథ్యంలో స్థానిక మారీసు పేటకు చెందిన భాస్కర చౌదరి, రవి దేవరాజ్ ద్వారా పరిచయమై పెళ్లి చేసుకుంటానని ఆమెను తెనాలి పిలిపించాడు. నమ్మించి తనపై లైంగిక దాడికి పాల్పడ్డాడని పద్మ కుమారి శనివారం ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జనసేన ఫ్లెక్సీ చించివేత

ప్రజాశక్తి-తాడేపల్లి

పెనుమాకలో జనసేన కార్యకర్తలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని స్థానిక టిడిపి కార్యకర్త పి.అక్బర్‌ఖాన్ చించివేశారు. ఎవరైనా ఇదేమని ప్రశ్నిస్తే చంపేస్తా అంటూ గొడ్డలితో వీరంగం చేశాడు. ఈసంఘటనతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. జరిగిన ఘటనపై జనసైనికులు తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-మంగళగిరి

పట్టణ పరిధిలోని ఆటోనగర్ సమీపంలో ఒక చెట్టుకు టవల్తో ఉరి వేసుకొని మృతి చెందిన సంఘటన శనివారం జరిగింది. ఈ వ్యక్తి 35-40 సంవత్సరాల మధ్య వయసు ఉంటుందని పట్టణ పోలీసులు తెలిపారు. మతి చెందిన గుర్తు చేయండి వ్యక్తి బ్లూ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడని తెలిపారు. ఎవరైనా గుర్తుపడితే పట్టణ పోలీసులకు తెలపాలని కోరారు.

పటిష్టంగా లింగ నిర్ధారణ చట్టం అమలు

జిల్లాస్థాయి కమిటీ సమీక్షలో కలెక్టర్, కమిటీ చైర్మన్ ఎల్.శివశంకర్

ప్రజాశక్తి-నరసరావుపేట

లింగ నిర్ధారణ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. ఈ మేరకు మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ, జిల్లా స్థాయి సలహా సంఘం సంయుక్త సమావేశం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో శనివారం నిర్వహించారు. కమిటీ చైర్మన్ అయిన కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కొత్తగా 3 ఆస్పత్రులకు లింగ నిర్ధారణ చట్టం కింద అనుమతించడంతో పాటు 7 ఆస్పత్రులకు రెన్యువల్స్ అనుమతించగా 10 ఆసుపత్రులకు లింగ నిర్ధారణ చట్టం కింద మార్పులను అనుమతించినట్లు చెప్పారు. లింగ నిర్ధారణ చట్టం-1994ను సమర్థవంతంగా అమలు చేయాలని, ఈ చట్టం పరిధిని ఎవరైనా అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో ఇప్పటివరకు 146 ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రులు లింగ నిర్ధారణ చట్టం పరిధి కింద అనుమతులిచ్చారని, త్వరలో వీరందరితో కలిపి ఒక అవగాహన సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. ఎఎస్‌పి జి.బిందు మాధవ్, డాక్టర్ ఎం.వసంత కిరణ్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ జి.శోభారాణి, జిల్లా ఇమ్యూనిటీ అధికారి డాక్టర్ బి.గీతాంజలి, ఏరియా హాస్పిటల్ సుపరింటెండెంట్ డాక్టర్ బి.వి రంగారావు, డాక్టర్ జి.గిరిరాజు, డాక్టర్ ఎ.శోభారాణి, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలహనుమంతరెడ్డి, పౌర సంబంధాల శాఖ డిడి ఎఎస్ దీప్తి, శివకుమారి పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ శివశంకర్

నివాళులర్పిస్తున్న నాయకులు

సిపిఎం సభ్యులు మన్నెం నాగేశ్వరరావు కన్నుమూత

ప్రజాశక్తి-ముప్పాళ్ల : మండలంలోని నార్నెపాడుకు చెందిన సిపిఎం సభ్యులు మన్నెం నాగేశ్వరరావు (72) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. నాగేశ్వరరావు భౌతికకాయాన్ని సిపిఎం నాయకులు శనివారం సందర్శించి ఎర్రజెండాను కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి జి.బాలకృష్ణ మాట్లాడుతూ నాగేశ్వరరావు 30 ఏళ్లుగా సిపిఎంలో పని చేస్తూ పేదల సమస్యల పరిష్కారానికి, పార్టీ అభ్యున్నతికి కృషి చేశారని చెప్పారు. ఆయన మంచి కళాకారుడని, సాంఘిక నాటకాలు వేసేవారని గుర్తు చేశారు. గ్రామంలోని సంగం డెయిరీ పాల కేంద్రానికి అధ్యక్షులుగానూ పని చేశారని, అనంతరం రైతు సంఘంలో పనిచేసి రైతుల సమస్యలపై పోరాడారని అన్నారు. నివాళులర్పించిన వారిలో ఎం.కోటేశ్వరరావు, కె.ప్రభాకర్, ఎన్.సాంబశివరావు, పి.మస్తాన్‌రావు, నాగేశ్వరరావు, ఐ.శ్రీను పాల్గొన్నారు.

చలోఢిల్లీ పోస్టర్ అవిష్కరణ

ప్రజాశక్తి-ముప్పాళ్ల : కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ, కార్మిక, కర్షక సమ్యల పరిష్కారం కోసం ఏప్రిల్ 5న నిర్వహించే చలోఢిల్లీ కార్యక్రమానికి అన్ని రంగాల ప్రజలూ తరలిరావాలని ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని మాదలలోని సిపిఎం కార్యాలయంలో పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, రైతుసంఘం, కౌలురైతు సంఘం నాయకులు ఎం.వెంకటరెడ్డి, జి.జాలయ్య, కె.సాంబశివరావు, పి.సైదాఖాన్, సిహెచ్.నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ కృష్ణకాంత్

పల్నాడులో ప్రప్రథమంగా అరుదైన చికిత్స

బైపాస్ సర్జరీ చేయాల్సిన వ్యక్తికి స్టంట్ అమరిక

శ్రీ దత్తా సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్‌లో అత్యంత క్లిష్టమైన వైద్యం విజయవంతం

ప్రజాశక్తి - నరసరావుపేట

అస్వస్థతకు గురై అపస్మారక స్థితిలో చికిత్స కోసం వచ్చిన 52 ఏళ్ల వ్యక్తికి పరీక్షలు నిర్వహించగా బైపాస్ సర్జరీ చేయాల్సిన పరిస్థితులున్నా ప్రత్యామ్నాయ చికిత్స చేయాలని రోగి బంధువులు కోరడంతో పల్నాడు జిల్లాలో ఇంతకు ముందు ఎప్పుడు చేయని అరుదైన, అత్యంత క్లిష్టతరమైన గుండె ఆపరేషన్ చేసి కాపాడారు. ఇందుకు పట్టణంలోని ప్రకాష్ నగర్ శ్రీ దత్త సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వేదికగా నిలిచింది. హాస్పిటల్ అధినేత గుండె వైద్య నిపుణులు డాక్టర్ గార్లపాటి కృష్ణకాంత్ బృందం ఆధ్వర్యంలో 4 గంటల పాటు శ్రమించి ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా వివరాలను డాక్టర్ కృష్ణకాంత్ శనివారం వివరించారు. పల్నాడు జిల్లా కారంపూడి మండలం అడిగొప్పల నిదానంపాటి లక్ష్మి అమ్మవారి ఆలయ ప్రధాన అర్చకులైన 52 ఏళ్ల ఆర్.విజయ రామకుమార్ ఇటీవల తీవ్ర అస్వస్థతకు గురవడంతో చికిత్స కోసం తనను సంప్రదించారని తెలిపారు. గుండెకు రక్తసరఫరా అయ్యే రక్తనాళాల్లో మూడు నాళాలు మూసుకుపోయినట్లు పరీక్షల ద్వారా నిర్ధారించామని, బైపాస్ సర్జరీ చేయాల్సి ఉంటుందని కుటుంబ సభ్యులకు చెప్పామని అన్నారు. అయితే ఆయనకు ఇతర అనారోగ్య కారణాల దృష్ట్యా బైపాస్‌కు ప్రత్యామ్నాయంగా చికిత్స చేయాలని వారు కోరారని, దీంతో క్లిష్టమైన స్టెంట్ అమరికకు రంగం సిద్ధం చేశామని చెప్పారు. ఇలాంటి చికిత్స దేశంలో ప్రముఖ నగరాల్లోనే ఉంటుందని, ఐవియుఎస్ స్కానర్ ఆధారిత ప్రక్రియతో గుండె రక్తనాళాలను స్కానింగ్ చేస్తూ పల్నాడు ప్రాంతంలో ఇప్పటివరకు జరగని రీతిలో అత్యంతక్లిష్టతర స్టంట్ అమరికను విజయవంతంగా పూర్తి చేశామని వివరించారు. ఈ ప్రక్రియ ద్వారా గుండె రక్తనాళాల పరిమాణం, పూడికను విశ్లేషించే అవకాశం ఉంటుందన్నారు. ఈ ప్రక్రియ వల్ల స్టెంట్ అమరిక సంఖ్యను తగ్గించే అవకాశం ఉంటుందన్నారు. ఆపరేషన్ అనంతరం రోగి గుండెకు ఇతర ఇన్‌ఫెక్షన్లు సోకకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామని, 5 రోజుల క్రితం జరిగిన ఆపరేషన్ విజయవంతమై ప్రస్తుతం ఆయన పూర్తి ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు. డాక్టర్ కృష్ణకాంత్‌తోపాటు బృందంలోని డాక్టర్ జ్ఞానేశ్వరి, డాక్టర్ వేణుగోపాలరావుకు అర్చకుని కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

దాచేపల్లిలో టిడిపి సంబరాలు

ప్రజాశక్తి-దాచేపల్లి : ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి గెలిచిన సందర్భంగా స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో శనివారం విజయోత్సవాలు నిర్వహించారు. ఎన్‌టిఆర్, చంద్రబాబు చిత్రపటాలకు పాలాభిషేకం చేసిన మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టిడిపి విజయం సాధిస్తుందని చెప్పారు. అనంతరం కార్యకర్తలు టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు. నాయకులు జి.నాగేశ్వరావు, ఎన్.పుల్లయ్య, టి.శ్రీనివాసరావు, బద్రి, తిరుమలకుమార్ పాల్గొన్నారు.

డ్వాక్రా గ్రూపు సభ్యులకు మెగా చెక్కును అందిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

ఎమ్మెల్యేలను కొన్న డబ్బుతో పోలవరాన్ని పూర్తి చేయొచ్చు

పులిని చూసి నక్క వాతపెట్టుకున్నట్లు లోకేశ్ పాదయాత్ర

అసరా చెక్కుల పంపిణీలో మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి-నకరికల్లు

ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. వైఎస్‌ఆర్ ఆసరా మూడో విడత కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద శనివారం నిర్వహించిన కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లు లోకేశ్ పాదయాత్ర ఉందన్నారు. జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర నిర్వహిస్తే ఆశేష జనావాహిని అడుగులో అడుగు కలిపారని, లోకేశ్ పాదయాత్రకు స్పందనే లేదని ఎద్దేవ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒక్కో వైసిపి ఎమ్మెల్యేను చంద్రబాబు రూ.15 కోట్లకు కొన్నారని, ఇది పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడానికి అయ్యే ఖర్చు రూ.55 వేలకోట్లకు సమానమని ఆరోపించారు. అయినా 2024 ఎన్నికల్లో వైసిపి గెలిచి తీరుతుందన్నారు. ఆసరా పథకం ద్వారా మండలంలోని 1053 స్వయం సహాయక గ్రూపులకు రూ.8.49 కోట్ల లబ్ధి చేకూరుతుందని చెప్పారు. ఈ మేరకు మెగా చెక్కును లబ్ధిదార్లకు అందించారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ బి.రాఘవరెడ్డి, ఎంపిపి ఎం.అనురాధ, జెడ్‌పిటిసి హరీష్ యాదవ్, వైఎస్ ఎంపిపి ఎం.ప్రవీణ్ కుమార్‌రెడ్డి, డి.హుస్సేన్ బి బాషా, సర్పంచ్ పరస అంజమ్మ, ఎంపీటీసీ సభ్యులు, పల్నాడు జిల్లా డిఆర్డిఏ పిడి బాలు నాయక్, ఎంపీడీవో బి.శ్రీనివాసరెడ్డి, తహశీల్దార్ సురేష్, ఎపిఎం సునీత పాల్గొన్నారు.

నీటిని సరిగా శుద్ధి చేయకుండానే సరఫరా

ప్రజాశక్తి - చిలకలూరిపేట

తాగునీటికి లోటు రాకుండా సరఫరా చేస్తున్నట్లు అధికారులు, ప్రజాప్రతినిధులు పదేపదే చెబుతున్నా ఆచరణలో ఆ విధంగా లేదనే విమర్శలు వస్తున్నాయి. రంగు మారిన, శుద్ధికాని నీరు సరఫరా అవుతోందని, వీటిని తాగిన వారు అనారోగ్యంతో ఆస్పత్రి పాలవుతున్నారని సిపిఎం పట్టణ కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు అన్నారు. బ్లీచింగ్, ఫిల్టర్ తదితర నీటి శుద్ధి చర్యలు తీసుకోకుండా పైపులకు నేరుగా సరఫరా చేస్తున్నారని, దీంతో అనేకమంది వాంతులు, విరోచనలు తదితర రోగాల పాలయ్యారని చెప్పారు. కళామందిర్ సెంటర్ నుండి చీరాల వెళ్లే మార్గంలో మెయిన్ పైపులైను నీరంతా పచ్చగా పాచితో వస్తోందని, పది రోజులకుపైగా ఈ సమస్య నెలకొందని తెలిపారు. సీజనల్ వ్యాధులు పెరిగి ఆస్పత్రులకు జ్వరపీడితుల తాకిడి పెరిగిందని, ఈ నేపథ్యంలో మున్సిపాల్టీ సరఫరా చేసే నీరు తాగి మరింతమంది అనారోగ్యం పాలవుతారని ఆందోళన వెలిబుచ్చారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని, పన్ను వసూళ్లపై పెట్టిన శ్రద్ధ రక్షిత నీటి సరఫరాపైనా పెట్టాలని కోరారు. తాగునీరు సరఫరా చేసే కేంద్రాలను పరిశీలించడంతోపాటు శుద్ధి చర్యలపైనా ప్రత్యేకంగా కేంద్రీకరించాలన్నారు. ఇదే అంశంపై స్థానిక పండరిపురం రెండో లైనులో నివాసం ఉండే ఎం.విల్సన్ మాట్లాడుతూ మున్సిపాల్టీ సరఫరా చేసే నీరు తాగడం వల్ల తాను అనారోగ్యానికి గురైనట్లు చెప్పారు.

పచ్చగా ఉన్న ట్యాపు నీరు

తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.180 కోట్లు

బైపాస్ నిర్మాణానికి త్వరలో భూసేకరణ : ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు

ప్రజాశక్తి - వినుకొండ

వినుకొండ ప్రాంతంలో తాగునీటి సమస్య పరిష్కారానికి జల జీవన్ మిషన్ ద్వారా రెండు దశల్లో రూ.180 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తెలిపారు. ఈ మేరకు శనివారం తన కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. వాటర్ గ్రిడ్ ద్వారా నియోజకవర్గంలో తాగునీటి సమస్యను పరిష్కరించనున్నామని, బొల్లాపల్లిలో తాగునీటి సమస్య పరిష్కారానికై డీప్ కట్ నుండి చెరువుకు పైప్‌లైన్ నిర్మాణం కోసం రూ.12 కోట్లను ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. చీకటిగల పాలెం వద్ద నుండి బోడిచెబ్బునివారిపాలెం కోల్డ్ స్టోరేజ్ వద్ద వరకు జాతీయ రహదారి బైపాస్ నిర్మాణానికి త్వరలో భూమిని సేకరిస్తామని చెప్పారు. దీనిపై కలెక్టర్, జెసి ఇప్పటికే తనతో చర్చించారన్నారు. తాను సొంతగా వినుకొండకు హార్టికల్చర్ అగ్రికల్చర్ కాలేజీలు తెచ్చానని, కళాశాలలకు అవసరమైన భూమి అప్పగించగానే అనుమతులు వస్తాయని అన్నారు. వినుకొండ ఎన్ఎస్‌పి కాలనీలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి వచ్చేనెల 11న జిల్లా కలెక్టర్ ద్వారా శంకుస్థాపన చేస్తామని ప్రకటించారు. ఎన్ఎస్‌పి స్థలంలో 100 పడకల ఆస్పత్రి, ముస్లిమ్ కాలేజీ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ అభివృద్ధి పనులకు ప్రతిపక్ష నాయకులు సహకరించాలేగాని అడ్డుకోవడం సరైంది కాదన్నారు.

విలేకర్లతో మాట్లాడుతున్న బొల్లా బ్రహ్మనాయుడు

పాలరైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

పాలరైతుల సదస్సులో సంఘం రాష్ట్ర కార్యదర్శి అజయ్‌కుమార్

ప్రజాశక్తి-తెనాలి:
పాల రైతులను ప్రభుత్వం అన్ని విదాలుగా ఆదుకోవాలని, లీటరుకు రూ.10 చొప్పున ప్రోతాహం చెల్లించాలని, దీనిపై ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఏపి పాల రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కంచుమాటి అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక ఐతానగర్‌లో శనివారం రైతు సంఘం ఆధ్వర్యంలో పాల రైతు సదస్సు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ వ్యవసాయంతోపాటు పాడి పరిశ్రమ కూడా అభివృద్ధి చెందాలన్నారు. పొరుగు రాష్ట్రాలైన కేరళ. తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల్లో ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా పాల రైతులకు లీటరుకు రూ.5 నుంచి రూ.10 వరకూ చెల్లిస్తున్నారన్నారు. అదే విదంగా మన రాష్ట్ర ప్రభుత్వం కూడా లీటరుకు రూ.10చొప్పున రైతులకు చెల్లించాలన్నారు. డైరీలలో పాల రైతుల సమాచారం సేకరించటంద్వారా దీనిని ఆమలు చేయవచ్చునన్నారు. అలాగే సిఎం జగన్‌మోహన్‌రెడ్డి లీటరుకు రూ.4 చొప్పున చెల్లిస్తామని హామీ నిచ్చారనీ, ఆ హామీ నిలబెట్టుకోవాలన్నారు. అలాగే కేవలం అముల్ డయిరీ పరిధిలోని రైతులకే కాకుండా పాలరైతులందరికీ ఈ సదుపాయం వర్తింపచేయాలన్నారు. పాడి పశువులకు ఉచితంగా బీమా సౌకర్యం కల్పించాలని, పశు వైద్యశాలల్లో వైద్యులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. పశువులకు మందులు కూడా ఉచితంగా వైద్యశాలల ద్వారా పంపిణీ చేయాలన్నారు. పాల ఉత్పత్తిదారులకు

మాట్లాడుతున్న ఏడీ నాగిరెడ్డి, వేదికపైన అజయ్‌కుమార్ తదితరులు

సహకార డయిరీలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. గేదెల కొనుగోలుకు సబ్సిడీ రుణాలు, సబ్సిడీపై దాణా వంటి సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుందని, అయితే సంగం డెయిరీని ప్రైవేటుకు కట్టబెట్టడం ద్వారా భవిష్యత్‌లో పాల రైతులకు భరోసా ఉండదన్నారు. పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎ.నాగిరెడ్డి మాట్లాడుతూ పశువుల పెంపకంలో జాగ్రత్తలు వివరించారు. పారా గడ్డి, ఇంగ్లీష్ గడ్డి లాంటివి వాడకూడదన్నారు. పిల్లిపెసర, జనుము లాంటి ఆహారాన్ని అందించటం ద్వారా పశువులు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. గేదెలు కనీసం రోజుకు రెండు గంటలు ఎండలో ఉండాలని, ఫలితంగా కాల్షియం అందుతుంద న్నారు. గేదెలు ఆరోగ్యకరంగా ఉంటే పాలదిగుబడి కూడా పెరుగుతుందన్నారు. పశు సంవర్ధక శాఖ ద్వారా అందించే సదుపాయాలను పాల రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాల రైతులు వి.తబిత, వి.రోశయ్య, మేకల చిట్టిబాబు, నాయకులు ఎం.సాంభివరావు, షేక్ హుస్సేన్‌వలి పాల్గొన్నారు.

వార్డు వాలంటీర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు
నగరపాలక సంస్థ పరిధిలో ఖాళీగా ఉన్న 32 వార్డు వాలంటీర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, శనివారం అన్ని వార్డు సచివాలయాల్లోని నోటీసు బోర్డుల్లో ఖాళీల వివరాలు ప్రచురించామని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వాలంటీర్ పోస్టుకు దరఖాస్తుదారుడు 10వ తరగతి లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులై (ఆధార్ కార్డులోని పుట్టిన తేది, 10వ తరగతి సర్టిఫికేట్‌లోని పుట్టిన తేదీ ఒకటై ఉండవలెను), 2023 ఫిబ్రవరి 28 నాటికి 18 సంవత్సరములు నిండి, 35 ఏళ్లు మించని వారై ఉండాలన్నారు. ఆధార్ కార్డు చిరునామా సంబంధిత మున్సిపాలిటీ పరిధిలోనిదై ఉండాలన్నారు. ఈనెల 27 నుండి 30వ తేదీ వరకూ ఆన్లైన్ ద్వారా http://40.81.241.107/APVOLUNTEER20/apVolunteer 090420201049.vt వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 31న ఆన్‌లైన్‌లో దాఖలైన దరఖాస్తుల పరిశీలన , 2023 ఏప్రిల్ 1, 4 తేదీలలో మౌఖిక పరీక్షలు ఉంటాయన్నారు. ఎంపికైన వారు ఏప్రిల్ 6 నుండి విధుల్లో చేరాల్సి ఉంటుందన్నారు.

క్రీడా శిక్షణా శిబిరాల నిర్వహణకు దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు
జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో మే 1 నుండి 31వ తేదీ వరకూ నిర్వహిస్తున్న 50 ఉచిత వేసవి శిక్షణా శిబిరాల నిర్వహణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సిఇఒ యస్.పల్లవి, చీఫ్ కోచ్ ఎ.మహేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలో వేసవి శిక్షణా శిబిరాలను నిర్వహించటానికి ఆసక్తి ఉన్న క్రీడా అసోసియేషన్లు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా శిక్షకులు, సీనియర్ క్రీడాకారులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆసక్తి ఉన్న వారు తమ దరఖాస్తులను పూర్తి వివరాలతో ఏప్రిల్ 5వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా బి.ఆర్.స్టేడియంలో అందచేయాలని సూచించారు.

పబ్లిక్ టాయ్‌లెట్లకు నీటిసౌకర్యంపై లోక్‌అదాలత్‌లో విచారణ

ప్రజాశక్తి-తెనాలి
పురపాలక సంఘ పరిధిలో రద్దీ ప్రాంతాల్లో నిర్మించిన పబ్లిక్ టాయిలెట్స్‌కు నీటి సౌకర్యం కల్పించకపోవటంపై లోక్ అదాలత్‌లో కేసు విచారణకు వచ్చింది. పట్టణ పరిసర ప్రాంత అభివృద్ధి సంఘం పట్టణంలో 22 ప్రాంతాల్లో మరుగుదొడ్లు నిర్మించి, వాటికి నీటి సౌకర్యం కల్పించకపోవటంతో దుర్గంధం వెదజల్లుతున్నాయని పలుమార్లు పురపాలక సంఘ అధికారులకు పిర్యాదు చేశారు. వారి నుంచి స్పంద లేకపోవటంతో లోక్ అదాలత్ కోర్టులో పిర్యాదు చేశారు. దీనిపై గతంలోనే పురపాలక సంఘం అధికారులకు కోర్టు నోటీసులు జారీ చేసిందని, మార్చి 25 నాటికి నీటి సౌకర్యం కల్పిస్తామని అధికారులు కోర్టుకు తెలిపినట్లు సంఘం అధ్యక్షులు దరిశి శివకోటేశ్వరరావు చెప్పారు. అయితే ఈ కేసు శనివారం విచారణకు రావటంతో కొంత మేరకు మాత్రమే నీటి సౌకర్యం కల్పించామని, వచ్చేనెల 29 నాటికి పూర్తిస్థాయిలో నీటి సౌకర్యం కల్పిస్తామని అధికారులు కోర్టుకు తెలిపారని, ఆలోగా పనులు పూర్తిచేయాలని ఆయన అధికారులను కోరారు. సామాజిక దృక్పదంతో ప్రజాసమస్యలపై స్పందిస్తున్న సంఘం సేవలను పలువురు అభినందించారు. విచారణలో సంఘం సభ్యులు బొమ్మదేవర వెంకటేశ్వరరావు, ఎన్.కమల్‌కుమార్,అబ్దుల్ ఆరిఫ్, అబ్రహాం లింకన్, లింగేశ్వరరావు పాల్గొన్నారు.

రక్తహీనత ఉన్న గర్భిణులకు పౌష్టికాహారం

ప్రజాశక్తి-గుంటూరు
జిల్లాలో రక్తహీనత ఉన్న బాలికలు, గర్భిణీలను, ఎత్తు, బరువు తక్కువుగా ఉన్న పిల్లలను సక్రమంగా గుర్తించి వారికి పూర్తి స్థాయిలో పౌష్టికాహారం, అవసరమైన మందులు అందించేలా వైద్యారోగ్యశాఖ, విద్యాశాఖ, మహిళా, శిశు సంక్షేమ శాఖలు సమన్వయంతో ప్రణాళికా ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు.శనివారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి సుస్థిర అభివృద్ధి లక్ష్యాల అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ బాలికలు, మహిళలలో రక్తహీనత, ఐదు సంవత్సరాల లోపు పిల్లలు ఎత్తు, బరువు తక్కువగా ఉండడం, బడి మాని వేసిన పిల్లలు, పాఠశాలల్లో టాయిలెట్స్ నిర్వహణ, విద్యుత్, మంచినీటి సౌకర్యాల అంశాలను బట్టి జిల్లా సుస్థిర అభివృద్ధి లక్ష్యాల ర్యాంకింగ్‌ను నిర్ణయిస్తున్నారన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు నిర్వహించిన రక్తహీనత పరీక్షల వివరాలు సరిగా లేనందున మరోసారి పరీక్షలు నిర్వహించాలన్నారు. అధిక రక్తహీనత గుర్తించిన గర్భిణీ స్త్రీలను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన వైద్య సేవలు అందించాలన్నారు. ఇప్పటి వరకూ గుర్తించిన 93 మంది అత్యధిక రక్తహీనత కలిగిన గర్భిణీ స్త్రీలకు డాక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్

వైయస్.ఆర్.సంపూర్ణ పోషణ క్రింద ఇస్తున్న ఆహారం వంద శాతం వినియోగించుకునేలా చూడాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పోషణ ఆహారాన్ని తీసుకునేందుకు 5694 మంది అంగీకారం తెలిపారని, అయితే 3600 మంది మాత్రమే పోషణ ఆహారాన్ని తీసుకున్నట్లు గణాంక వివరాలు తెలియజేస్తున్నాయన్నారు. మిగిలిన పిల్లలందరికీ సంపూర్ణ పోషణ ఆహారాన్ని అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గుర్తించిన 255 మంది టీనేజ్ ప్రెగ్నన్సీని విశ్లేషించి ఇందుకు గల వాస్తవ కారణాలను గుర్తించాలన్నారు. బడి మానివేసిన 566 మంది పిల్లలను తిరిగి బడులలో చేర్పించడం జరిగిందని, మరో 26 మంది పిల్లలను బడిలో చేర్పించాల్సి వుందని డిఇఓ జిల్లా కలెక్టర్ దష్టికి తీసుకొచ్చారు. సమీక్షలో సీపీఓ శేషశ్రీ , ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ మనోరంజని, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డా. శ్రావణ్ బాబు, డిఇఓ శైలజ, ఐసీడీఎస్ సూపర్వైజర్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

1న పెన్షన్ చెల్లింపునకు చట్టం చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు
రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు ప్రతి నెలా 1వ తేదీన పెన్షన్లు చెల్లించే విధంగా చట్టం చేయాలని ఎపిజిఇఎ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు పి.కేశవరెడ్డి కోరారు. స్థానిక నగరంపాలెంలోని ఎపిజిఇఎ కార్యాలయంలో జిల్లా పెన్షనర్ల సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కేశవరెడ్డి మాట్లాడుతూ పెన్షనర్లకు రావాల్సిన డిఎ బకాయిలన్నింటినీ చెల్లించాలని, 11వ పిఆర్‌సి బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వ నెట్‌వర్క్ హాస్పిటల్స్‌లో పెన్షనర్లకు, కుటుంబ పెన్షనర్లకు నగదు రహిత వైద్యాన్ని అందించాలని, జిజిహెచ్‌లో పెన్షనర్లకు కార్డియాలజీ, న్యూరాలజీ విభాగాలలో ప్రత్యేక చికిత్సలతో సదుపాయాలు ఏర్పాటు చేయాలని కోరారు. వైఎస్ఆర్ ట్రస్ట్‌లో ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ సర్వసభ్య సమావేశంలో తీర్మానించారు. ఎపిజిఇఎ జిల్లా అధ్యక్షులు సయ్యద్ చాంద్‌బాషా

మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ఏప్రిల్ నుండి ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పెన్షనర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మత్తయ్య, గౌరవాధ్యక్షులు హనుమంతరావు, లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు శ్యామ్ కుమార్, నగర అధ్యక్షులు నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ఆప్కో షోరూంలలో నూతన వస్త్రాలు

హైదరాబాద్‌లో షోరూం సందర్శించిన గంజి చిరంజీవి

ప్రజాశక్తి-మంగళగిరి : శనివారం సాయంత్రం తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ లోని ఆప్కో షోరూంనీ ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి పరిశీలించారు. షోరూంలో జరుగుతున్న అమ్మకాలను, కొనుగోలు ను వివరాలను అడిగి తెలుసుకున్నారు. నేటి కస్టమర్ల అభిరుచికి తగినట్టుగా నూతన వస్త్రాలను రూపొందించి కస్టమర్లకు అందుబాటులోకి తీసుకొస్తామని అన్నారు. అవసర మైన స్టాక్‌ను వారం రోజులలో పంపించాలని అధికారులను ఆదేశించారు. ఆప్కో మనకి తల్లి లాంటిది దానిని మనమందరం కట్టుబడి ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. షోరూం తరుపున ఏ అవసరాలు, ఇబ్బందులు ఉన్న తనను డైరెక్ట్ కాంటాక్ట్ అవ్వచని చైర్మన్ చిరంజీవి అన్నారు.

అంగన్వాడీ ఆధ్వర్యంలో 2కె రన్

ప్రజాశక్తి-తెనాలిరూరల్
స్థానిక పాండురంగపేట 27వ వార్డు అంగన్వాడీ కేంద్రంలో శనివారం పోషణ- పక్షోత్సవాలను నిర్వహించారు. పోషణ మరియు ఆరోగ్యం పై 2కె రన్ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ సౌజన్య చిరుధాన్యాలపై తల్లులకు అవగాహన కల్పించారు. వార్డు సచివాలయం సిబ్బంది, ఏ ఎన్ ఎం, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న చేస్తున్న పి తిలక్ బాబు తదితరులు

ఎన్ఆర్ఐలో పాలీసెట్, ఎపిఆర్‌జెసి ఎంట్రన్స్‌కు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి- మేడికొండూరు
మండలంలోని విశదల అడ్డరోడ్డు వద్ద గల ఎన్ఆర్ఐ ఇంజనీరింగ్ కళాశాలలో ఉచితంగా పాలిసెట్ ఏపీ ఆర్ జె సి, ఎంట్రన్స్‌కు సంబంధించి ఉచిత శిక్షణా తరగతులు నిర్వహిస్తామని ఎన్నారై విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిడికిటి తిలక్ బాబు తెలిపారు. శనివారం ఉచిత కోచింగ్ ఏర్పాటుకు సంబంధించి కరపత్రాలను కళాశాలలో ఆవిష్కరించారు. ఏప్రిల్ 20వ తారీకు నుండి ఈ శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ప్రతిరోజు రెండు గంటలు లెక్కలు, ఫిజిక్స్, కెమిస్ట్రీ గంట చొప్పున ప్రత్యేకమైన క్లాసులు నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి రోజూ 90 ప్రశ్నలతో కూడిన పరీక్ష ఉంటుందని తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థిని విద్యార్థులు ఏప్రిల్ 10వ తారీఖు లోపు తమ పేర్లు నమోదు చేయించుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు 99590 85200/ 888599 5458/ 9396 992 111 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో ఈవో బండారు సీతారామయ్య, ఎన్నారై పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ రవి కుమార్, ఎన్నారై ట్రైనింగ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ రాజశేఖర్, ఇండియన్ స్ప్రింగ్స్ స్కూలు ప్రిన్సిపల్ నవీన్ చౌదరి, వై శ్రీనివాసరావు, ఏజీఎం బి భాను ప్రసాద్ పాల్గొన్నారు.

అభినందనలు అందుకుంటున్న ఎంపికైన విద్యార్థులు

ఎన్ఎంఎంఎస్‌కు ఇద్దరు ఎంపిక

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పట్టణ పరిధి పసుమర్రులోని శ్రీ మద్ది కామయ్య జెడ్‌పి పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులు షేక్ మహమ్మద్ అల్తాఫ్, నార్నేపాటి పార్వతి ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌నకు అర్హత సాధించినట్లు హెచ్ఎం ఎమ్‌డి యాసీన్ శనివారం తెలిపారు. ఈ మేరకు పాఠశాలలో విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. హెచ్ఎం మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులకు నాలుగేళ్లపాటు ప్రతిసంవత్సరం రూ.12 వేల స్కారల్‌షిప్ కేంద్ర ప్రభుత్వం నుండి అందుతుందని తెలిపారు. ఎంపికైన విద్యార్థులతోపాటు వారికి ప్రత్యేక శిక్షణిచ్చిన ఉపాధ్యాయులు మహమ్మద్ గౌస్‌ను పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఎర్రం వెంకటసుబ్బయ్య, 15, 16 వార్డుల కౌన్సిలర్లు జె.సుబ్బారావు, మస్తాన్‌వలి, పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు జి.హరిబాబు, జి.మధుసూదన్‌రావు, విద్యా కమిటీ మాజీ చైర్మన్ మీరావలి అభినందించారు.

పరీక్ష సామగ్రితో విద్యార్థులు

పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి

ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని గారపాడు జెడ్‌పి పాఠశాల పదో తరగతి విద్యార్థులకు మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రిని శనివారం అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం చంద్రశేఖర్, ఫౌండేషన్ సభ్యులు ఎం.కృష్ణారావు, కె.ప్రసాద్, కె.కిరణ్ పాల్గొన్నారు.

అవగాహన కార్యక్రమంలో సిబ్బంది

చంద్రాజుపాలెంలో పౌష్టికాహార ప్రదర్శన

ప్రజాశక్తి -బెల్లంకొండ

ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తప్పనిసరిగా తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని పిహెచ్‌సి వైద్యులు కోటేశ్వరరావు సూచించారు. మండలంలోని చంద్రాజుపాలెం అంగన్వాడీ కేంద్రంలో శనివారం చిరుధాన్యాలు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ షేక్ పెద్ద ఇమాంబి మాట్లాడుతూ పౌష్టికాహారంపై చైతన్యం, అవగాహన కోసం పోషన్ పక్వాడా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆహారంలో పిండి పదార్థాలు, మాంసకృతులు, కొవ్వు తగినంతగా ఉండేలా చూసుకోవాలని, చిరు ధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు ఆహారంగా తీసుకోవాలని వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి ఎస్.శాంసన్, ఎఎన్ఎం విజయలక్ష్మి, పిహెచ్ఒ మణికుమారి, మహిళా పోలీస్ అనూష, అంగన్వాడీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రభ ఏర్పాటులో వివాదం

సర్దిచెప్పిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని ఆరేపల్లి ముప్పాళ్లలో శ్రీబాల చౌడేశ్వరి అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా విద్యుత్ ప్రభల ఏర్పాటు స్థలం వివాదస్పదమైంది. తిరుణాళ్ల సమయంలో ప్రతిసారీ టిడిపి నాయకులు విద్యుత్ ప్రభను ఏర్పాటు చేసే స్థలంలో వైసిపి నాయకులు విద్యుత్ ప్రభను ఏర్పాటు చేయడంతో టిడిపి నాయకులు గ్రామంలోని మెయిన్ బజారులో రామాలయం వద్ద ప్రభ ఏర్పాటుకు స్థలాన్ని ఎంపిక చేసుకున్నారు. దీని అనుమతి కోసం పోలీసులకు దరఖాస్తు చేసుకోగా ఆ స్థలాన్ని రూరల్ సీఐ ఎస్.రమేష్‌బాబు పరిశీలించారు. ఈపూరు-నరసరావుపేట ప్రధాన రహదారిపై ప్రభను ఏర్పాటు చేస్తే ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతాయని, ఖాళీ ప్రదేశంలో ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. అయితే దీన్ని టిడిపి వారు వ్యతిరేకించారు. శనివారం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి.. తాము ఎంపిక చేసుకున్న స్థలంలోనే ప్రభను ఏర్పాటు చేస్తామని, ఇందుకు అనుమతివ్వకుంటే గ్రామంలో ఆందోళన చేస్తామని పోలీసులతో ఖరాఖండిగా చెప్పి గ్రామానికి వెళ్లారు.

ఆందోళన చేస్తున్న వారికి సర్దిచెబుతున్న ఎమ్మెల్యే

ఇది తెలిసిన మాజీ ఎమ్మెల్యే, టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు ఎ.ముప్పాళ్ల గ్రామానికి చేరుకుని స్థానికులతో మాట్లాడారు. పోలీసులు అధికార పార్టీ కనుసన్నల్లో పని చేస్తున్నారని, ఇది సమంజసం కాదని అన్నారు. అంతలో అక్కడికి చేరుకున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అక్కడివారితో మాట్లాడారు. తిరునాళ్ల ప్రశాంతంగా జరుపుకోవాలని, వివాదాలు రాకుండా, ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా ప్రభ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దీంతో వివాదం సద్దుమణిగింది.

చదువే కాదు.. ఆటపాటల్లోనూ రాణించాలి

- విద్యార్థులకు ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సూచన
- ఘనంగా స్ప్రింగ్ బోర్డు టెక్నో స్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి-నరసరావుపేట

విద్యార్థులకు బహుమతులిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి

విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటల్లోనూ రాణించాలని, వారిని ఆ దిశగా పాఠశాలల యాజమాన్యం ప్రోత్సహించాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక ప్రకాష్ నగర్‌లోని స్ప్రింగ్ బోర్డు టెక్నో స్కూల్ 8వ వార్షికోత్సవాలను స్థానిక భువనచంద్ర టౌన్ హాలులో శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్పొరేట్ స్థాయి విద్యను సామాన్య, మధ్యతరగతితో పాటు అన్ని వర్గాల పిల్లలకు అందుబాటు ఫీజులతో అందిస్తున్న ప్రయివేటు కళాశాలల అసోసియేషన్ అధ్యక్షులు స్ప్రింగ్ బోర్డు స్కూల్ డైరెక్టర్ భూమిరెడ్డి శ్రీనివాసరెడ్డిని ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు చెప్పారు. విద్య పరంగా వెనుకబడిన పల్నాడు జిల్లాలో విద్యాభివృద్ధికి మరింత కృషి చేయాలన్నారు. స్ప్రింగ్ బోర్డ్ విద్యాసంస్థలు ఉన్నతమైన లక్ష్యంతో నిర్వహిస్తున్నారని, విద్యార్థులు లక్ష్యం నిర్దేశించుకొని దాని సాధనకు కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం వివిధ పోటీల్లో బహుమతులు సాధించిన విద్యార్థులకు ఎమ్మెల్యే బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించారు. కార్యక్రమంలో ఇవిఎం స్వామి, పుడా చైర్మన్ మిట్టపల్లి రమేష్, సుబ్బారెడ్డి, భూమిరెడ్డి కొండారెడ్డి పాల్గొన్నారు.

కుడి జలవిద్యుత్ కేంద్రం సిబ్బందికి అభినందన, సత్కారం

ప్రజాశక్తి-విజయపురిసౌత్

ఆనాటి ఇంజినీర్లు, రాళ్లు ఎత్తిన కూలీల శ్రమ ఫలితమే ఈనాటి ఆధునిక దేవాలయంగా కీర్తి గడించిన నాగార్జునసాగర్ ప్రాజెక్టు అని ఏపీ జెన్కో ఎమ్‌డి శ్రీధర్ అన్నారు. కేంద్రం వద్ద శనివారం నిర్వహించిన వేడుకల్లో ఆయన మాట్లాడుతూ కుడి జలవిద్యుత్ కేంద్రం 1983 నుంచి అంచెలంచెలుగా నిర్మాణం పూర్తి చేసుకుందని, ఫిబ్రవరి 25న 40 ఏళ్లు పూర్తి చేసుకున్న జల విద్యుత్ కేంద్రం ఈ ఏడాది అత్యధికంగా 295.58 ఎంయు విద్యుత్తును ఉత్పత్తి చేసిన సంవత్సరంగా గుర్తింపు పొందిందని చెప్పారు. 2006-07లో 283.512 ఎంయు విద్యుత్ ఉత్పత్తిని అధిగమించి విద్యుత్ ఉత్పత్తి చేసినందుకు ఇంజినీర్లను, సిబ్బందిని అభినందించారు. వివిధ విభాగాల్లో పని చేసి రిటైర్ అయిన పలువుర్ని సత్కరించారు. కార్యక్రమంలో సిఇ సుధీర్‌బాబు, ఎస్ఇ శ్రీనివాస్, డిఇ వైఎస్ఆర్‌కె ప్రసాద్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల వినతి

కుడి జల విద్యుత్ కేంద్రంలో 12 ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్టర్ కార్మికులకు జీతాలు పెంచాలని 327 యూనియన్ ఆధ్వర్యంలో ఏపీ జెన్కో ఎమ్‌డి శ్రీధర్‌కు వినతి పత్రం అందజేశారు వీరిలో అధ్యక్షుడు సాంబశివరావు, సూరజ్ చాంద్, రామకృష్ణ, కిరణ్ ఉన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీ ప్రారంభం

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పట్టణంలోని స్కాలర్స్ డిగ్రీ కాలేజీ మైదానంలో మనోజ్ క్రికెట్ క్లబ్, కొమ్మ మహేష్ కుమార్ అండ్ ఫ్రెండ్ సర్కిల్ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి క్రికెట్ టెర్నమెంట్ శనివారం ప్రారంభమైంది. టోర్నీని పిడుగురాళ్ల సిఐ పి.ఆంజనేయులు, పల్నాడు హాస్పిటల్స్ అధినేత డాక్టర్ అశోక్ కుమార్, పవన్‌రెడ్డి ప్రారంభించారు. తొలుత స్కాలర్స్ విద్యా సంస్థల డైరెక్టర్ పురుషోత్తమరావు బౌలింగ్ చేయగా సీనియర్ క్రీడాకారులు జనార్దన్ మాస్టర్ బ్యాటింగ్ చేసి బాల్‌ను బౌండరీకి తరలించారు.

గ్యాస్ లీకై మధ్యాహ్న భోజన కార్మికురాలికి గాయాలు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

మండలంలోని కరాలపాడులోని అద్దంకి నాంచారమ్మ గుడి వద్ద డిపెప్-2 ఉర్దూ, మండల ప్రాథమిక పాఠశాల ముగ్దుంనగర్‌లో శనివారం అగ్నిప్రమాదం వాటిల్లింది. విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని వండుతున్న సమయంలో గ్యాస్ సిలిండర్ పైప్ లీకై మంటలు చెలరేగాయి. దీంతో పాఠశాల గదిలో వంట చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికురాలు మలింబికి చీర అంటుకొని గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న సర్పంచ్ షేక్ గడ్డంవలి, గ్రామ కన్వీనర్ షేక్ కుంకులగుంట అబ్దుల్లా, సచివాలయ కన్వీనర్ కళాయి ఇస్మాయిల్, మోతాద్ పెద్ద మహాబు తదితరులు ఘటనా స్థలికి వెళ్లి క్షతగాత్రురాలిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గ్యాస్ లీకై మంటలు చెలరేగిన సమయంలో విద్యార్థులు దూరంగా ఉండటం వలన పెద్ద ప్రమాదమే తప్పిందని, ఇతరులెవరికీ ఇబ్బంది తలెత్తలేదని సర్పంచ్ చెప్పారు.

పారిశుధ్య పనులకు ఎమ్మెల్యే పరిశీలన

ప్రజాశక్తి-నరసరావుపేట

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలో పారిశుధ్య పనులను సమర్థవంతంగా నిర్వహించి ఆహ్లాదకర వాతావరణం నెలకొల్పేందుకు మున్సిపల్ అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం ఉదయం పట్టణంలోని 31వ వార్డులో ఎమ్మెల్యే పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. చెత్తను రోడ్లపై వేయవద్దని, ఇళ్ల దగ్గరకు వచ్చిన మున్సిపల్ వాహనాల్లో వేసి కార్మికులకు సహకరించాలని కోరారు. డ్రెయినేజీ కాల్వల్లో ఏళ్ల తరబడి పేరుకపోయిన చెత్తను చైన్ ప్రోక్లైన్ మిషన్ ద్వారా శుభ్రం చేయాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. స్వచ్ఛ నరసరావుపేట సాధనకు పురపాలక సంఘం చేస్తున్న కృషికి ప్రజలు సహకరించాలని కోరారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

పశువులకు గాలికుంటూ వ్యాధి టీకాల కార్యక్రమంలో మార్చి 25 నుండి ఏప్రిల్ 24 వరకు నిర్వహిస్తున్నట్లు సత్తెనపల్లి పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. సత్తెనపల్లి పట్టణంలో గోశాలలో పశువులకు గాలి కుంటు వ్యాధి నియంత్రణ టీకాలు శనివారం వేశారు. నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకూ తప్పని సరిగా టీకాలు వేయించాలని కోరారు.

ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటించండి

ప్రజాశక్తి-తాడేపల్లి

ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న ప్రధాని మోడీ చర్యలను ప్రతిఘటించాలని వక్తలు కోరారు. ఏప్రిల్ 5న ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ తాడేపల్లిలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు, సిఐటియు నాయకులు వేముల దుర్గారావు, బూరుగ వెంకటేశ్వర్లు, గాదె సుబ్బారెడ్డి, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, ఎన్. దుర్గారావు, టి.నాగేశ్వరరావు, కె. సుబ్బారావు, ఆర్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. మోడీ ప్రభుత్వం అవలంభిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు నిర సనగా చలో ఢిల్లీ కార్యక్రమానికి ప్రజలు తరలి రావాలని సిఐటియు పట్టణ కార్య దర్శి వేముల దుర్గారావు పిలుపునిచ్చారు. సీతానగరం, మహానాడు, సుందరయ్య నగర్ ప్రాంతాల్లో మునిసిపల్ కార్మికులతో నిర్వహించిన జనరల్‌బాడీ సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కె.వెంగమ్మ, శ్యామల, లక్ష్మీ, నారాయణ పాల్గొన్నారు.

వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జొన్నా శివశంకరరావు, సిఐటియు నాయకులు

మునిసిపల్ కార్మికులతో మాట్లాడుతున్న వేముల దుర్గారావు

ప్రజాశక్తి-గుంటూరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా భవిష్యత్‌లో జరిగే పోరాటాలకు మద్దతు ఇవ్వాలని సిఐటియు గుంటూరు నగర తూర్పు ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు కోరారు. ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగే కార్మిక, రైతు, వ్యవసాయ కార్మికు మహా ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ నగరంలోని వెంకటాద్రిపేటలో సిఐటియు నాయకులు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కోశాధికారి టి.రాధ, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు నక్కా మస్తాన్, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు రోజా, ఎస్తేరు, ప్రమీల పాల్గొన్నారు.

గుంటూరులోని వెంకటాద్రిపేటలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

శ్మశాన వాటికను పరిశీలించిన సబ్ కలెక్టర్

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పొన్నూరు పట్టణం లో ముస్లిం స్మశాన వాటికను తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ పొన్నూరు మండల తహశీల్దార్ శ్రీకాంత్ కేదార్నాథ్ కలసి పరిశీలించారు. స్మశాన వాటిక వద్ద అంజుమన్ కమిటీ సభ్యులు అంజుమన్ కమిటీ కు వనరులు కొరకు షాపులు నిర్మిస్తుండగా ముస్లిం మత విరుద్ధమని పట్టణానికి చెందిన ముస్లిం పెద్దలు నిర్మాణలు నిలుపుదల కోసం హైకోర్టును ఆశ్రయించారు. శ్మశాన వాటిక లోనే స్థలం విషయం గురించిన వివరాలను తహశీల్దార్‌ను అడిగి సబ్ కలెక్టర్ తెలుసుకున్నారు. నిర్మాణాలపై విచారించి తుది నివేదికను జిల్లా అధికారులకు సమర్పిస్తానని ఆమె తెలిపారు.

ఎన్‌ఎస్‌ఎస్‌ఎం విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఎన్‌ఎంఎంఎస్ లో సత్తా చాటిన విద్యార్థులు

ప్రజాశక్తి-తెనాలి

నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్) పరీక్షలో పట్టణంలోని ఎన్‌ఎస్‌ఎస్‌ఎం హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. మొత్తం ఏడుగురు విద్యార్థులు పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన విద్యార్థుల అభినందన సభలో ప్రధానో పాధ్యాయులు రాజకిషోర్ మాట్లాడుతూ ఫిబ్రవరి ఐదున ప్రభుత్వం పరీక్షను నిర్వహించిదని, పరీక్ష రాసినవారిలో పాఠ శాల నుంచి ఏడుగురు విద్యార్థులు విజయం సాధించటం పాఠశాలకే గర్వకారణమన్నారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు వరుసగా నాలుగేళ్ళపాటు ఏడాదికి రూ.12 వేల చొప్పున ఉప కారవేతనం లభిస్తుందన్నారు. మున్సిపల్ స్కూల్స్‌లో పాఠశాలకు చెందిన పుట్టి అఖిల ప్రథమస్థానం సాధిచంటతోపాటు జిల్లా స్థాయిలో పదో స్థానంలో నిలిచిందన్నారు. ఉత్తీర్ణులైన వారిలో పుట్టి అఖిలతో పాటు లక్ష్మీమాధురి, కొండముది రిజిల్, షేక్ ఫరీద్, రూపస్‌పాల్, తూమాటి సింధు, షేక్ ఇర్షాద్ ఉన్నా రన్నారు.

జాతీయ ఉత్తమ ప్రదర్శనగా 'అంధస్వరం'

ప్రజాశక్తి-తెనాలి

పట్టణానికి చెందిన కళల కాణాచి సంస్థ ప్రద`ర్శించిన 'అంధ స్వరం' నాటిక జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రదర్శనగా నిలిచింది. ఉగాది సందర్భంగా ఈనెల 22, 23, 24 తేదీల్లో సిఆర్‌సి కళాపరిషత్ ఆధ్వర్యంలో కోనసీమ జిల్లా రావుల పాలెంలో 23వ జాతీయ స్థాయి సాంఘిక నాటిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పట్టణానికి చెందిన కళల కాణాచి సంస్థ వ్యవస్థాపకులు, సినీ మాటల రచయిత బుర్రా సాయిమాధవ్ సారథ్యంలో ప్రదర్శించిన 'అంధస్వరం' నాటిక జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రదర్శనగా ప్రథమ స్థానాన్ని పొందింది. ఏకంగా రూ.3 లక్షల నగదు పారితోషకాన్ని దక్కించుకుంది. ఉత్త మ ప్రదర్శనతో పాటు ఉత్తమ దర్శకత్వం, రచనా విభా గాల్లోనూ మరో రెండు బహుమతులు కైవశం చేసుకున్న నాటికకు రచన, దర్శకత్వం ఎంఎస్ చౌదరి వహించారు. ఈ సందర్భంగా ప్రదర్శన టీమ్‌ను బుర్రా సాయిమాధవ్ అభినందించారు. శుక్రవారం రాత్రి రావులపాలెంలో జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో సినీ నటులు తని`కెళ్ళ భరణి, శుభలేఖ సుధాకర్, పలువురు సినీ, నాటక రంగ ప్రముఖుల సమక్షంలో తమకు అభినందనలు తెలిపినట్లు కళల కాణాచి బృందం తెలిపింది.

ఉత్తమ ప్రదర్శన పురస్కారం అందుకున్న అంధస్వరం బృందం

ప్రాతూరులో సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

కెఎల్ డీమ్డ్ టుబి విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం (ఎన్.ఎస్.ఎస్.) ఆధ్వర్యంలో దత్తత గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు ప్రారంభించినట్లు వర్సిటీ విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు తెలిపారు. శనివారం ప్రాతూరు గ్రామంలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 9 ఆధ్వర్యంలో సైబర్ నేరాలపైన ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాతూరులో వ్యవసాయ విభాగం వాలంటీర్లు ప్రతీ ఇంటికి వెళ్లి సైబర్ నేరాలపైన అవగాహన కల్పించారు. మోసం చేసే వారు మీ ఏటీఎం కార్డు బ్లాక్ అయిందని, సిమ్ కార్డ్ బ్లాక్ అయిందని, లాటరీ వచ్చిందని, బ్యాంకు ఖాతా ఈకేవైసీ చేయడం కోసం ఓటిపి చెప్పాలంటూ ఫోన్ చేసి అగంతకులు అడిగే ప్రశ్నలకు అసలు సమాధానాలు చెప్పవద్దంటూ హెచ్చరించారు. ఈ సేవా కార్యక్రమాలలో పాల్గొన్న వాలంటీర్లను విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథివర్మ, ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎన్. వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, వ్యవసాయ విభాగాధిపతి సెంథిల్ మురుగన్, డైరెక్టర్ పి. రత్న ప్రసాద్, సాక్ డైరెక్టర్ పి. సాయి విజయ్, అసోసియేట్ డీన్ డాక్టర్ కె. రూత్ రమ్య, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ పి. శ్రీకాంత్ రెడ్డి, సమన్వయకర్తలు పి. సురేష్, జి. చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కెఎల్‌యులో రక్తదాన శిబిరం

కెఎల్ యూనివర్సిటీలో స్టూడెంట్ ఆక్టివిటీ సెంటర్‌లో యూనిసెఫ్, సంయుక్తం గా సేఫ్ లైఫ్ క్లబ్ ఆధ్వ ర్యంలో శనివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో విద్యార్థులు పాల్గొని రక్తదానం చేశారు.

సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించండి

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ఆదివారం తెనాలి డివిజన్ పరిధిలోని అన్ని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల వద్ద వినియోగదారుల సౌకర్యార్థం విద్యుత్ బిల్లులు చెల్లించే అవకాశం కల్పించామని ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ తెనాలి కార్యాలయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వివి చిరంజీవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఆన్ లైన్ వెబ్ సైట్ www.apcpdcl.in ద్వారా లేదా ఏపిసిపిడిసిఎల్ మొబైల్ యాప్ ద్వారా సులభంగా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చున్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని సూచించారు. సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించి ప్రభుత్వానికి సహకరించాలని కోరారు.

విద్యార్థులకు ఎగ్జామ్ పాడ్స్ పంపిణీ

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని వడ్డేశ్వరం జడ్పీ హైస్కూల్ విద్యార్థినీవిద్యార్థులకు శనివారం ఎగ్జామ్స్ పాడ్స్ ను ఊర మస్తాన్ రావు, శివ రాజకుమారి ట్రస్ట్, చీరాల ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థిని, విద్యార్థులకు 103 మందికి ఎగ్జామ్ ప్యాడ్స్ అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు ఊరా మస్తాన్ రావు, శివ రాజకుమారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.సుబ్బారావు, ఉపాధ్యాయులు కాకుమాను జోజప్ప, కె.కాంతారావు, పి.బుజ్జిబాబు, ఉమాదేవి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి

పది పరీక్షల సందర్భంగా తాడేపల్లి, నులకపేట, పెనుమాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లలో శనివారం విద్యార్థినీ విద్యార్థులకు 335 పరీక్ష అట్టలు పంపిణీ చేశారు. ఊరమిమస్తాన్‌రావు, రాజేశ్వరి చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-మంగళగిరి

ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయంలో శనివారం 8 మందికి ఆరు లక్షల విలువైన సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఆరోగ్యశ్రీ వర్తించని వారికి ఈ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆళ్ల రామకష్ణారెడ్డి, వైసీపీ పట్టణ అధ్యక్షులు ఎం.మల్లేశ్వరరావు, వైసిపి నాయకులు ఫిరోజ్ పాల్గొన్నారు.

నేడు స్మార్ట్ క్లాస్ తరగతి గదుల ప్రారంభం

ప్రజాశక్తి-పెదనందిపాడు రూరల్

పూర్తి గ్రామీణ ప్రాంతమైన పెదనందిపాడులో 49 ఏళ్ల క్రితం స్థాపించిన లైన్స్ మాంటిసోరి స్కూల్ దిన దినాభివృద్ధి చెందుతోందని లైన్స్ మాంటిసోరి సిబిఎస్‌ఈ స్కూల్ గౌరవాధ్యక్షులు దాసరి శేష గిరిరావు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ముద్దన నగరాజకుమారి అన్నారు. శనివారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు, దాతల సహ కారంతో ఒకటి నుండి 10వ తరగతి వరకు రూ.25 లక్షల ఖర్చుతో నూతనంగా తీర్చిదిద్దిన స్మార్ట్ క్లాసు తరగతి గదులను, 9 క్రీడా మైదా నాలను ఈ నెల 26న ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణ్‌రావు, తాళ్లూరి పూర్ణచంద్రరావు(ప్రవాస ఆంధ్రులు), వాహ నాల ఇన్‌స్పెక్టర్ నంబూరి శివ నాగేశ్వర రావు, వికాస్ విద్యాసంస్థల డైరెక్టర్ కె.వివేకానంద పాల్గొని ప్రారంభించనున్నారని అన్నారు. తక్కువ ఖర్చుతో విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించా లనే లక్ష్యంతో పాఠశాలలో 10 గదులను స్మార్ట్ క్లాసులకు అనుకూలంగా తీర్చిదిద్దడం జరిగిందని చెప్పారు.

సెలవు రోజునా జిఎంసి క్యాష్ కౌంటర్లు

ప్రజాశక్తి-గుంటూరు

పన్ను చెల్లింపుదార్లకు వీలుగా ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ నగరపాలక సంస్థ క్యాష్ కౌంటర్లు యధావిధిగానే పని చేస్తాయని నగర కమీషనర్ కీర్తి చేకూరి శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం పన్ను బకాయిలను ఏక మొత్తంగా చెల్లించిన వారికి వడ్డీ రాయితీ కూడా ప్రకటించిందన్నారు. యజమానులు మార్చి నెలాఖరులోపు తమ ఆస్తి, ఖాళీ స్థల పన్నులు పూర్తిగా చెల్లించి వడ్డీ రాయితిని పొందాలని కోరారు. అలాగే నిర్మాణంలో భవన యజమానులకు ఖాళీ స్థల పన్నుపై వడ్డీ రాయితీ ప్రకటించడం సదవకాశమన్నారు. జిఎంసి ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయంల్లోని క్యాష్ కౌంటర్లతో పాటుగా, భారత్‌పేటలోని 140, పెద్ద పలకలూరు రోడ్డులోని 106, వసంతరాయపురం మెయిన్ రోడ్డులోని 148వ వార్డు సచివాలయాల్లోనూ క్యాష్ కౌంటర్లు ఉదయం 8 నుండి సాయంత్రం 8 గంటల వరకు పనిచేస్తాయన్నారు. కావున జిఎంసికి చెల్లించాల్సిన ఆస్తిపన్ను, నీటి పన్ను, ఖాళీ స్థలం పన్ను, నీటి మీటర్ చార్జీలు, డిఅండ్ఓ ట్రేడ్ లైసెన్సులు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ప్రజ్ఞావికాసం పరీక్షలో కుసుమకుమారికి ప్రథమ స్థానం

ప్రజాశక్తి-గుంటూరు

కుమారిని అభినందిస్తున్న స్కూల్ డైరెక్టర్, ఎస్ఎఫ్ఐ నాయకులు

స్థానిక ఎన్‌జిజిఒ కాలనీలోని సుమేధా హైస్కూల్లో 10వ తరగతి చదువుతున్న ఎస్.కుసుమకుమారి ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్, జెవివి సంయుక్తంగా నిర్వహించిన ప్రజ్ఞావికాసం 'మోడల్ పరీక్ష'లో ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిందని స్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్‌రెడ్డి తెలియ జేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి యం.కిరణ్, ఇతర నాయకులు, స్కూల్ డైరెక్టర్ చేతులమీదుగా శనివారం కుసుమ కుమారికి మెమోంటో, సర్టిఫికెట్‌ను అందచేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ రాంబాబు, ఇన్‌చార్జి యం.విలియమ్స్ పాల్గొని విద్యార్థినిని అభినందించారు.

జయంత్ అకజోజో తదితరుల్ని సన్మానిస్తున్న వర్సిటీ వీసీ, తదితరులు

మమ్మల్ని ఎవరూ ప్రేమించరు..

క్వీర్ నిలయం ఫౌండర్ జయంత్ అకజోజో

ప్రజాశక్తి-గుంటూరు

వివిధ రకాల హార్మోన్ల అసమతుల్యతతో ఎల్‌జీబీటీక్యూఐఏ (లెస్బియన్, గే, బైసెక్సువల్, ట్రాన్స్‌జెండర్, ఇంటర్‌సెక్స్, క్వీర్/ క్వశ్చనింగ్, అసెక్సువల్)లుగా మారిన మమ్మల్ని ఎవరూ ప్రేమించరని క్వీర్ నిలయం ఫౌండర్ జయంత్ అక జోజో అన్నారు.వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లా డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 'రికగ్నిజేషన్ ఆఫ్ ఎల్‌జీబీటీక్యూఐఏ : ఏవే ఫార్వార్డ్ ఇన్ 21 సెంచరీ' అనే అంశంపై రెండో జాతీయ స్థాయి కాన్ఫరెన్స్‌ను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన క్వీర్ నిలయం ఫౌండర్ జయంత్ అక జోజో మాట్లాడుతూ జీవితంలో మీకు నచ్చినట్టు ఉండటంతో పాటు మీకు నచ్చిన పనులను మాత్రమే చేయండని విద్యార్థులకు సూచించారు. మీకు నచ్చిన పనిని ఆపే హక్కు ఎవరికీ లేదన్నారు. ఇతరుల కోసం బతకడం మొదలు పెడితే.... నీకంటూ సొంత జీవితం అనేది లేకుండా పోతుందన్నారు. జీవితంలో ఎదురయ్యే ప్రతి సమస్యలను, మార్పులను ఎదొర్కనడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమానికి మరో ముఖ్య అతిథిగా హాజరైన క్వీర్ నిలయం వాలంటీర్, ట్రాన్స్‌ఉమెన్ మధుశాలిని మాట్లాడుతూ ప్రజా రవాణాలో ప్రయాణిస్తున్నప్పుడు మా పక్కన కూర్చోవడానికి సాధారణ ప్రజలు ఎవరూ ఇష్టపడరని బాధపడింది. హార్మోన్ల అసమతుల్యతతో ఉన్న మమ్మల్ని సాధారణ ప్రజలలాగానే గుర్తించండని అభ్యర్థించారు. అబ్బాయిగా పుట్టిన నేను అమ్మాయిగా మారే క్రమంలో ఎన్నో కష్ట, నష్టాలను ఎదుర్కోవాల్సి వచ్చిందని తెలియజేశారు. అనంతరం దేశ నలుమూలల నుంచి వచ్చిన విద్యార్థులు వారి రీసెర్చ్ పేపర్లను ప్రజెంట్ చేశారు. కార్యక్రమంలో క్వీర్ నిలయం వాలంటీర్, హారిక లిల్లీ, పాట్రీసియా, వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

ఐసిడిఎస్ అర్బన్-1 పరిధిలో పోషణ్ పక్వాడ

ప్రజాశక్తి-గుంటూరు

ఐసిడిఎస్ గుంటూరు అర్బన్-1 ప్రాజెక్టు పరిధిలోని బృందావన్‌గార్డెన్స్‌లోని యుపిహెచ్‌సిలో శనివారం పోషణ పక్వడా కార్యక్రమం జరిగింది. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రహమాన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ అబూబకర్, సైమన్‌రాజ్, ఆర్.అరుణ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు చిరుదాన్యాలు, ఆకు కూరలు, పప్పుదాన్యాలు, ఐరన్ ఉన్న పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైద్యులు

జిల్లాలో 29,322 డ్వాక్రా సంఘాలకు ఆసరా లబ్ధి

ప్రజాశక్తి-గుంటూరు

లబ్ధిదారులకు మెగా చెక్కును అందిస్తున్న కలెక్టర్ తదితరులు

మహిళల అభివద్దే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనేక అభివద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని, మహిళలు పథకాలను సద్వినియోగం చేసుకొని వద్ధిలోకి రావాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి దెందులూరు నుంచి వైయస్సార్ ఆసరా ఆర్థిక సాయం నిధులను వర్చువల్ విధానంలో విడుదల చేసే కార్యక్రమంలో గుంటూరు కలక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి, పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ 2019 మార్చి 31 నాటికి పొదుపు సంఘాలు తీసుకున్న రుణం మొత్తాన్ని ప్రభుత్వం నాలుగు విడతల్లో చెల్లిస్తామని మాట ఇచ్చిన ప్రకారం శనివారం మూడవ విడత చెల్లింపులు చేసినట్లు చెప్పారు. ఇటీవల కాలంలో ఫిరంగిపురంలో డీఆర్డీఏ సహకారంతో రూ.50 లక్షల వ్యయంతో స్వయం సహాయక సంఘ సభ్యులు చేయూత మహిళా మార్ట్ ఏర్పాటు చేసుకున్నారని, రాష్ట్రంలో ఈవిధంగా ఏర్పాటైన అన్ని మాల్స్ కంటే ఫిరంగిపురం మార్ట్ అధిక విక్రయాలు కొనసాగిస్తుందని తెలియజేశారు. జిల్లాలోని మిగిలిన నియోజకవర్గాల్లోనూ ఇలాంటి మార్ట్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లాలో 29,322 స్వయం సహాయక సంఘాలలోని 2,85,932 మంది మహిళలకు రూ.246.30 కోట్లు వారి ఖాతాలకు నేటి నుండి ఏప్రిల్ 5వ తేదీ వరకు జమ కానున్నాయన్నారు. లబ్దిదారులకు మెగా చెక్కును అందచేశారు. సోషల్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్ గనిక ఝాన్సీరాణి, ఏ.పి. విభిన్న ప్రతిభావంతులు, సీనియర్ సిటిజన్ సహాయ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్, టిడ్కో డైరెక్టర్ నాగేశ్వరి, శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ యం. పురుషోత్తం, నగర డిప్యూటీ మేయర్ సజీలా తదితరులు పాల్గొన్నారు.

అంతుబట్టని తాడికొండ రాజకీయం

వీక్షణం

తాడికొండ నియోజకవర్గ రాజకీయాలు ఎప్పుడు ఎలా మార్పునకు దారితీస్తాయన్నదీ అంతుబట్టడం లేదు. ఇటు వైసిపి, అటు టిడిపికి ఈ నియోజకవర్గం నాయకుల తీరు అంతుబట్టక తలలు పట్టుకునే పరిస్థితి ఏర్పడుతుంది. ఈ నియోజకవర్గంలో రాజకీయ పరిణామాలు అటు తెలుగు దేశం, ఇటు వైసిపి అగ్రనాయకులకు మింగుడుపడటం లేదు. రాజధాని ప్రాంతంగా ఉన్న తాడికొండ నియోజకవర్గంలో ఉన్న రాజకీయ ప్రాధాన్యత దృష్ట్యా ఈనియోజకవర్గంపై పట్టుకోసం వైసిపి, టిడిపి ఇప్పటి నుంచే పావులు కదుపుతున్నాయి. అయితే ఈ రెండు పార్టీలకు అసమ్మతి బెడద ఉంది. తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి అధికార పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా ఓటు వేసి వైసిపి నుంచి సస్పెండ్ కావడం ఉమ్మడి గుంటూరు జిల్లాలో కలకలం రేపింది. శ్రీదేవి సస్పెన్షన్‌తో పార్టీ వర్గాలు దిగ్భ్రాంతికి గురయ్యాయి. టిడిపి అధినేత చంద్రబాబు నుంచి భారీగా ముడుపులు తీసుకుని ఎమ్మెల్సీ కోటాలో వైసిపి అభ్యర్థికి వ్యతిరేకంగా శ్రీదేవి ఓటు వేసిందని పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి చేసిన ప్రకటన పార్టీలో కలకలం రేపింది. అయితే ఇప్పటి వరకు శ్రీదేవికి అనుకూలంగా ఉండి ఆమె ఆర్థిక లావాదేవీల్లో పాలుపంచుకున్న వారు కంగారు పడుతున్నారు. వారిపై నిఘా విధించి ఆమె అక్రమాలపై ఆరాతీయాలని వైసిపి అధిష్టానం కొంత మంది నాయకులను పురమాయించినట్టు తెలిసింది. గతేడాది సెప్టెంబరులోనే శ్రీదేవి పనితీరును గమనించిన సిఎం వైఎస్ జగన్ పార్టీ పరిస్థితిని చక్కదిద్దేందుకు తాడికొండ సమన్వయకర్తగా వివాదరహితుడైన ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్‌ను నియమించారు. శ్రీదేవికి అనుకూల వర్గం వర ప్రసాద్ నియామకాన్ని వ్యతిరేకించింది. ఆయన్ను పక్కన పెట్టే వరకు రెండు నెలల పాటు శ్రీదేవికి మద్ధతుగా ఆందోళనలు చేసింది. పార్టీ పెద్దలపై తీవ్రవత్తిడి తెచ్చింది. గత డిసెంబరులో వరప్రసాద్ స్థానంలో కత్తెర సురేష్ కుమార్‌ను సమన్వయకర్తగా నియమించారు. గత నాలుగేళ్లుగా శ్రీదేవికి అనుకూలంగా ఉండి పార్టీ పదవులు, నామినేటెడ్ పోస్టుల కోసం సొమ్ములు వసూలు చేసిన ద్వితీయశ్రేణి నాయకులు ఇప్పుడు శ్రీదేవి అవినీతిని బయటపెడతామని ప్రకటించడం కొసమెరుపు. గతేడాది సెప్టెంబరులో సిఎం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకించిన నాయకులు ఇప్పుడు శ్రీదేవిపై విమర్శలు చేస్తూ మళ్లీ పార్టీ అధినాయకత్వం మెప్పుకోసం ప్రయత్నిస్తున్నారన్న విమర్శలు పార్టీలో వ్యక్తం అవుతున్నాయి. మరో వైపు టిడిపిలో గ్రూపు రాజకీయాలు ఆపార్టీ అధిష్టానంకు తలనొప్పిగా మారాయి. నియోజకవర్గం ఇన్‌ఛార్జిగా ఉన్న తెనాలి శ్రావణ్‌కుమార్‌కు వ్యతిరేకంగా బోరుపాలెంకు చెందిన తోకల రాజవర్ధన్‌కు మాజీ ఎంపి రాయపాటి సాంబశివరావు బహిరంగంగా మద్ధతు పలికింది. దీనిపై టిడిపి ద్వితీయ శ్రేణి నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా రాజధాని ప్రాంత వాసులు ఈఅంశాన్ని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లారు. ఎవరో ఒకరిని ముందే నిర్ధారించాలని ఎన్నికల వరకు కాలయాపన చేసి 2019లో మాదిరిగా చేయవద్దని ఇటీవల కొంత మంది రాజధానిప్రాంత నాయకులు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకువెళ్లారని తెలిసింది. అప్పట్లో శ్రావణ్‌కుమార్‌ను వ్యతిరేకించిన వర్గం ఇప్పటికీ ఆయనతో అంటీముట్టన్నట్టు ఉంటోంది. ప్రస్తుతం నియోజకవర్గంలో అసమ్మతి నివురుగప్పిన నిప్పులా ఉంది.

(ఎ.వి.డి.శర్మ)

ఏఎన్‌యులో మరో కంగెన్ మెడికల్ డివైజ్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఏఎన్‌యు

ఏఎన్‌యులో కంగెన్ మెడిక్ డివైజ్‌ను ఆవిష్కరిస్తున్న విసి తదితరులు

మరో కంగెన్ మెడికల్ డివైస్‌ను శనివారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోని మహిళా వసతి గృహంలో ఆవిష్కరించారు. విద్యార్థులకు మంచి విద్యతోపాటు మంచి ఆరోగ్యాన్నీ ఇవ్వాలనే ఉద్దేశంతో ప్రొఫెసర్ రాజశేఖర్ పట్టేటి చేతుల మీదుగా దీనిని ఆవిష్కరించారు. నేటి పరిస్థితుల్లో గాలి, ఆహార, నీరు కలుషితమవుతున్న నేపథ్యంలో ఆచార్య రాజశేఖర్ పట్టేటి, పవర్ కంగెన్ టీమ్ సభ్యులు వీరంకి శ్రీనివాసరావు, వైవి సాయిరాం, ఆర్ల సూర్యచంద్ర ద్వారా కంగన్ వాటర్ మంచిదని డెమోల ద్వారా నిర్ధారించిన తర్వాత, ఎంతో అధ్యయనం చేసి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని దీనిని ఏర్పాటు చేసినట్లు కంగెన్ వాటర్ డిస్ట్రిబ్యూటర్ వీరంకి శ్రీనివాసరావు తెలిపారు. నేటి పరిస్థితుల్లో వ్యాధి నిరోధక శక్తి పెంచుకోవడమే కాకుండా అనేక రకాల అనారోగ్య సమస్యల బారిన పడకుండా కాపాడుకోవడానికి ఈ కంగెన్ ఆల్కలైన్ అయోనైజర్ వాటర్ ఎంతగానో ఉపయోగపడుతుందని డెమో రూపంలో వివరించినట్లు తెలిపారు. ఇప్పటికే ప్రపంచంలోని అనేక దేశాల్లో ప్రముఖులు, సెలబ్రెటీలు, ఆస్పత్రులు, డాక్టర్లతోపాటు సామాన్యులు సైతం దీనిని వినియోగిస్తున్నారని తెలిపారు.